76809 94755 www.rajadhanivartalu.com rajadhanivartalu rajadhaniv RNI No. APTEL 2015/ 66622 స్థాపితం : 2015 Postal Regd No: GTR/84/2019-21

రాజధాని వార్తలు

RAJADHANI VARTALU

అమరావతి సంపుటి : 4 సంచిక : 30, పేజీలు 4, వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు వార పత్రిక సోమవారం 29 - ఆదివారం 5 మే, 2019

Amaravati Volume : 4 Issue : 30, Pages 4, Rate : 2.00 ANDHRA PRADESH CAPITAL'S FIRST TELUGU WEEKLY Monday 29- Sunday 5 May 2019

వివరాలు2లో...

మే1న లక్ష్మీస్ ఎన్టీఆర్ విడుదల

వివరాలు3లో...

వయస్సు 12.. బీఎండబ్ల్యూ కారు..

వివరాలు4లో...

రాజకీయ క్రీడలో లంక రక్తసిక్తం

వివరాలు4లో...

ముస్లింలను ఉగ్రవాదులుగా చూడొద్దు

అధికారం దక్కేది ఏ ఓటుతో ...?

రాజధాని వార్తలు, అమరావతి : రాష్ట్రంలో ఎన్నికలు జరిగి రెండు వారాలైనా ఫలితాలు ఎవరికి అనుకూలంగా ఉంటాయనే విషయం రాజకీయ నాయకులకు పరిశీలకులకు,

ఎన్నికల ఫలితాలపై విస్తృత చర్చలు



విశ్లేషకులకు అంతుపట్టడం లేదు. ఇంతవరకు జరిగిన ఎన్నికలకు ముందు వివిధ పార్టీల ప్రచారం, ఎన్నికల వాగ్దానాలు, ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తి, పోలింగ్ శాతం, పోలింగ్ సరళిని బట్టి పోలింగ్ ఫలితాలపై అంచనాలు, విశ్లేషణలు వచ్చేవి. వివిధ సంస్థల సర్వేలు వచ్చేవి. ఈ అంచనాలు పూర్తిగా కాకపోయినా కొంతవరకు వాస్తవరూపం ధరించేవి. ఈ సర్వేల ఆధారంగా ప్రధాన పక్షాలు సాధించే సీట్లపై బెట్టింగులు జరిగేవి. ఈ సారి కూడా బెట్టింగులు జరుగుతున్నట్లు వార్తలు వస్తున్నా – ఈసారి పరిస్థితులు వేరుగా ఉన్నాయి. ఫలితాలు ఎవరికీ అనుకూలంగా ఉంటాయనే విషయంలో ఎంతో అనుభవం ఉన్న విశ్లేషకులు కూడా చెప్పలేకపోతున్నారు. పోలింగ్ ప్రారంభంలో కొన్నిచోట్ల ఈవీయం లు మొరాయించి మూడు నాలుగు గంటలు పోలింగ్

- మిగతా 2 లో

ధీటుగా ప్రధాని ఎవరనే అంశాలోనూ చంద్రబాబు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. తమ తొలి లక్ష్యం మోడీని ఓడించటమని..ఆ తరువాత ప్రధాని ఎవరనేది తాము నిర్ణయించుకుంటామని చెబుతున్నారు. యునైటెడ్ ఫ్రంట్ కన్వీనర్‌గా నాడు జాతీయ రాజకీయాల్లో పోషించిన పాత్ర మరోసారి బాబు కోరుకుంటున్నారంటూ విశ్లేషణలు మొదలయ్యాయి. జాతీయ స్థాయిలో మోదీకి వ్యతిరేకంగా పలువురు నేతలు ఆరోపణలు చేస్తున్నా..చంద్రబాబు వారి కంటే మోదీ పైన ఆరోపణల్లో ఒక అడుగు ముందున్నారు. **ఇక, లోక్‌సభ ఫలితాలు వచ్చే లోగా తన స్థానం ఢిల్లీ రాజకీయాల్లో సుస్థిరం చేయాలనేది బాబు ఆలోచనగా కనిపిస్తోంది.**

అయితే ఏపీ ఎన్నికల ఫలితాలే చంద్రబాబు రాజకీయ అడుగులకు ప్రామణికంగా మారనున్నాయి. చంద్రబాబు ఇప్పటికీ ఏపీలో తాము తిరిగి అధికారంలోకి రావటం ఖాయమన్న ధీమాతో ఉన్నారు. అదే సమయంలో మోడీకి వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో రాజకీయ పక్షాలను కూడ గట్టటంలో ముందున్నారు. మోడీకి

- మిగతా 2 లో

ఢిల్లీలో చంద్రబాబు మరో దీక్ష

రాజధాని వార్తలు, అమరావతి : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు త్వరలో ఢిల్లీలో దీక్షకు సిద్ధమవుతున్నారు. కొద్ది రోజుల క్రితం ఏపీకి కేంద్ర హామీలు అమలు చేయాలంటూ చంద్రబాబు ఢిల్లీలో దీక్ష చేసారు. ప్రస్తుతం జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో వీవీ ప్యాట్స్ స్లిప్పులను 50 శాతం లెక్కించాలనే డిమాండ్‌తో మిత్రపక్షాలతో కలిసి ఈ దీక్షకు నిర్ణయించారు. అయితే, ఢిల్లీ వేదికగా ముఖ్యమంత్రి దీక్ష ఆలోచన పై భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

ఏపీలో ఈసీ తీసుకున్న నిర్ణయాల నుంచి ఎన్నికల సంఘం పైనా..ఈవీఎంల నిర్వహణ పైనా చంద్రబాబు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ఎన్నికల సంఘం రిమోట్ మోడీ ఆపరేట్ చేస్తున్నారంటూ ఆరోపించారు. ఎన్నికల సంఘం ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటుందని,జాతీయ స్థాయిలో విమర్శలు కొనసాగించారు. వీవీప్యాట్స్ స్లిప్పులను 50 శాతం లెక్కించాలంటూ సుప్రీంలో రివ్యూ పిటీషన్ వేశామని స్పష్టం చేసారు. ఇదే డిమాండ్‌తో మరో సారి చంద్రబాబు నిరసన దీక్షకు సిద్ధమయ్యారు. అందుకోసం బీజేపీయేతర పార్టీల నేతలతో కలిసి దీక్ష చేయాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి ముహూర్తం ఖరారు కానుంది.

ఏపిలో ఎన్నికలు ముగిసాయి. జాతీయ స్థాయిలో కొంత కాలంగా చురుగ్గా ఉంటున్న చంద్రబాబు..దేశ రాజకీయాల్లో తిరిగి క్రియా శీలక పాత్ర పోషించాలని కోరుకుంటున్నారు. ఏపీలో ఫలితాలు ఎలా ఉన్నా..జాతీయ స్థాయిలో మోడీ వ్యతిరేక రాజకీయాల్లో చంద్రబాబు క్రియాశీలకంగా వ్యవహరించి..బీజేపీయేతర పక్షాల్లో పట్టు సాధించాలని వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. అందులో భాగంగానే మోడీకి

ఏపీలో రాష్ట్రపతి పాలన ?

రాజధాని వార్తలు, అమరావతి : ఉన్నతాధికారుల విషయంలో ప్రభుత్వం నియంతృత్వంగా వ్యవహరిస్తోందనీ, ఇది రాజ్యాంగ విరుద్ధంగా భావిస్తూ కేంద్రం రాష్ట్రపతి పాలన విధించే అవకాశాలున్నాని న్యాయ నిపుణులు చెబుతున్నారు. ప్రధాన ప్రతిపక్షం వైసీపీ సైతం టీటీడీ నగల విషయంలో లేవనెత్తుతున్న ప్రశ్నలు అధికార పక్షానికి సవాలుగా మారబోతున్నాయనీ, ఈ పరిణామాలు కేంద్రం జోక్యం చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నాయని తెలుస్తోంది. ఎన్నికల ఫలితాలు రావడానికి ఇంకా 25 రోజులు ఉండగా, ఈవీఎంల వీవీప్యాట్లలో 50 శాతం స్లిప్పులను కౌంటింగ్ చెయ్యాలంటూ, అందుకు మద్దతు కోసం దేశమంతా తిరుగుతున్న టీడీపీ అధినేత చంద్రబాబుకి రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు కొత్త తలనొప్పులు తెచ్చిపెడుతున్నాయని తెలుస్తోంది.

ఏపీలో ఎండలు పెరిగాయి. తాగునీటి సమస్య ఎక్కువవుతోంది. అకాల వర్షాలు వెంటాడుతున్నాయి. విధాన పరమైన నిర్ణయాలు తీసుకునే అవకాశాలు లేకుండా ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. ఇదే సమయంలో ఉన్నతాధికారులు తమదైన సొంత ప్రకటనలు చేస్తుండటం ప్రభుత్వానికి ఇబ్బందిగా మారుతోంది. ప్రభుత్వం తమపై నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తోందని ఉన్నతాధికారులు ఆరోపిస్తుండగా, ఉద్యోగులు తమకు సహకరించట్లేదని ప్రభుత్వం మండిపడుతోంది.

టీటీడీ బంగారం వివాదం కూడా ప్రభుత్వాన్ని చిక్కుల్లో పడేస్తోంది. బంగారం తరలింపు వెనక టీడీపీ కుట్ర ఉందంటున్న వైసీపీ, వారం రోజుల్లో ఆధారాలతో సహా నిరూపిస్తామని ప్రకటించింది. బంగారం విషయంలో టీటీడీ, ప్రభుత్వం రెండూ తగిన జాగ్రత్తలు తీసుకోలేదనీ, తెరవెనక కుట్ర ఉన్నందువల్లే ఇలా చేశాయనీ వైసీపీ ఆరోపిస్తోంది. కావాలనే లేనిపోని అసత్యాలు ప్రచారం చేస్తూ... లబ్ది పొందేందుకు వైసీపీ యత్నిస్తోందని టీడీపీ కౌంటర్లిస్తోంది. ఇలా రెండు పార్టీలూ దుమ్మెత్తిపోసుకుంటున్నాయి. ఇవన్నీ గమనిస్తున్న కేంద్రం రాష్ట్రంలో రాజకీయ అనిశ్చితి ఏర్పడుతోందని భావిస్తున్నట్లు సమాచారం. ఇలాగే కొనసాగితే ఉద్రిక్త పరిస్థితులు తలెత్తే ప్రమాదం ఉందని నిఘా వర్గాలు హెచ్చరిస్తుండటంతో కేంద్రం అలర్ట్ అవుతోంది. ముఖ్యంగా ఫలితాల ప్రకటన రోజున రాష్ట్రంలో కచ్చితంగా శాంతి భద్రతల సమస్య తలెత్తుతుందని నిఘా వర్గాలు చెప్పడంతో ముందుగానే రాష్ట్రపతి పాలన అమలుకు కేంద్రం పరిశీలిస్తోందని తెలుస్తోంది. ఫలితాలకు ముందే రాష్ట్రపతి పాలన తెస్తే, టీడీపీ పూర్తిస్థాయి (ఐదేళ్లు) అధికారంలో ఉన్నట్లు అవ్వదు. అది ఆ పార్టీకి ఇబ్బందికర పరిణామమే. అయితే రాష్ట్రపతి పాలన తెచ్చేంత దారుణ పరిస్థితులు ఏవీ లేవంటున్న టీడీపీ వర్గాలు, అంతా వైసీపీ చేస్తున్న హైడ్రామా అని కొట్టిపారేస్తున్నాయి. ఫలితాల రోజున రాష్ట్రంలో శాంతి భద్రతలకు ఎలాంటి ఢోకా లేకుండా చేస్తామంటున్నాయి.

ముఖ్యమంత్రి అధికారంపై తీవ్ర పోరుకు చంద్రబాబు

- ఆంక్షలపై ఎన్నికల కమీషన్ పట్టు
- ఈసీ పాత్రపై చర్చ



రాజధాని వార్తలు, విజయవాడ : అధికారులతో ముఖ్యమంత్రి సమీక్షలు జరపడంపై ఎన్నికల కమీషన్ ఆంక్షలు విధించటం మరోసారి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల కమీషన్ల మధ్య వివాదానికి దారితీసింది. ముఖ్యమంత్రి అధికారాలతో ఎన్నికల కమీషన్ జోక్యాన్ని తీవ్రస్థాయిలో నిరసన తెలపాలని చంద్రబాబునాయుడు నిర్ణయించారు.

ఎన్నికల నియమావళి అమలు చేయడంలో వెనక్కి తగ్గే ప్రసక్తి లేదని ఎన్నికల కమీషన్ వర్గాలు పేర్కొంటున్నాయి. స్వతంత్రం వచ్చాక దేశంలో ఎన్నో ఎన్నికలు జరిగాయి. ఎన్నికల నియమావళి అమలయింది.కాని, ఇప్పుడు రాష్ట్రంలో వచ్చిన పరిస్థితులు ఎప్పుడూ రాలేదు. ఇంటలిజెన్స్ అధికారి వేంకటేశ్వరరావు బదిలీ ఆ వెంటనే ప్రధాన కార్యదర్శి బదిలీతో ముఖ్యమంత్రి ఎన్నికల కమీషన్ మధ్య వివాదం ప్రారంభమైనది. అధికారుల ఆకస్మిక బదిలీలను ముఖ్యమంత్రి తీవ్రంగా ఆక్షేపించారు. అ తరువాత పోలింగ్ లో ఈవిఎం లు కొన్నిచోట్ల మొరాయించడం వివాదాస్పదమైనది.

ముఖ్యమంత్రి ఎన్నికల కమీషన్ వివాదం – ఎన్నికల నియమావళి, ఎన్నికల కమీషన్ల పరిధిపై చర్చలకు దారితీసింది. ఎన్నికల విధులకు కేటాయించిన అధికారుల విషయంలో ప్రభుత్వ ప్రమేయం ఉండకూడదని అలాగే సక్రమంగా ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘానికి అన్ని అధికారాలు ఉంటాయనే విషయంలో ఎవరికీ అభ్యంతరం లేదు. ఎన్నికల విధులలో లేని ప్రభుత్వ యంత్రాంగంపై ముఖ్యమంత్రికి పూర్తి అధికారం ఉంటుందని, ముఖ్యమంత్రి అధికారాలతో జోక్యం చేసుకునే అధికారం ఎన్నికల కమీషన్ కు లేదని అంటున్నారు. ఐదేళ్ళ పాలనకు ఎన్నికైన ప్రభుత్వం ఐదేళ్ళు పూర్తియ్యేవరకు అధికారంలో ఉంటుందని స్పష్టం చేస్తున్నారు.

ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తరువాత ఫలితాలు వచ్చేవరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని, కోడ్ అమలులో ఉన్నంతవరకు ఎన్నికల కమీషన్ కు సర్వాధికారాలు ఉంటాయని కమీషన్ వర్గాలు వాదిస్తున్నాయి. కొత్త ప్రభుత్వానికి ప్రజలు ఓటు వేశాక ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం కేవలం ఆపద్ధర్మ ప్రభుత్వం మాత్రమేనని ఐదేళ్ళ పదవీకాలం వర్తించదని ఎన్నికల కమీషన్ వర్గాల వాదన.

ఈ అంశంపై న్యాయనిపుణులు భిన్నభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్య వ్యవస్థ కోసం ఈ అంశంపై ఇంకా విస్తృత చర్చలు జరుపవలసి ఉంది. ఈ సందర్భంగా మరో విషయం కూడా పరిగణలోకి తీసుకొనక తప్పదు. దేశ వ్యాప్తంగా ఎన్నికలు జరుగుతున్నాయి. అన్నిచోట్ల ఎన్నికల కోడ్ ఉంది. కాని, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ లో ఉత్పన్నమైన పరిస్థితులు ఇతరచోట్ల లేవు. ఎన్నికల కమీషన్ ఆంధ్రప్రదేశ్ పై పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందని

- మిగతా 4లో

రాజధాని వార్తలు, డెస్క్ : విశ్వ ప్రయత్నం చేసి– ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, విశ్వవిఖ్యాత నటసార్వభౌమ, పద్మశ్రీ, డాక్టర్ నందమూరి తారకరామారావు జీవిత కథ రాస్తాననే నెపంతో ఆయన జీవితంలోకి ప్రవేశించిన లక్ష్మీ పార్వతి ఆ తర్వాత రామారావుకు భార్యగా స్థిరపడి పోయారు. ఆ పెళ్ళి రామారావుకూ, లక్ష్మీ పార్వతికీ రెండో పెళ్ళే, లక్ష్మీ పార్వతి రామారావు జీవిత కథను రాయడానికి ఇంత కష్టపడాల్సివస్తే, రామ్‌గోపాల్ వర్మచాలా ఈజీగా లక్ష్మీపార్వతి జీవిత కథను సినిమాగా రికార్డు చేశారు, అదీ అగస్త్య మంజుతో కలిసి. ఈ సినిమా చూశాక ఎవరైనా ఒకటే అనుకుంటారు– ఎన్టీఆర్ జీవితంలోకి లక్ష్మీపార్వతి ఎంట్రీఇవ్వకుండా ఉంటేఎన్టీఆర్ భారతదేశ ఉప ప్రధాని అయి ఉండేవారు. అనివార్యంగా చంద్రబాబు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అయి ఉండేవారు, ఈ వెన్నుపోటు ముద్ర పడకుండా. లక్ష్మీ పార్వతి ఎన్టీఆర్ జీవితంలోకి ఆలస్యంగా ప్రవేశించడం వలన చంద్రబాబు త్వరగా చిన్న వయసులోనే ముఖ్యమంత్రి కాగలిగారు. లక్ష్మీపార్వతిని బూచిగా చూపించి, ఎమ్మెల్యేలను

- మిగతా 2 లో

ఏపీలో ఎన్నికల ఫలితాలు ఆలస్యం : ద్వివేదీ

రాజధాని వార్తలు, అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల ఫలితాలు ఆలస్యం అవుతాయని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ద్వివేదీ ప్రకటించారు. కొన్నిచోట్ల మే 23 అర్ధరాత్రి తర్వాత ఫలితాలు వచ్చే అవకాశం ఉందన్నారు. వీవీప్యాట్‌లోని స్లిప్పులను కూడా లెక్కించాల్సి రావడంతో అధికారిక ఫలితాలు ఆలస్యం అయ్యే అవకాశం ఉందని ద్వివేదీ తెలిపారు. ఉదయం కౌంటింగ్ ప్రారంభమైతే, మధ్యాహ్నానికే ట్రెండ్ తెలుస్తుందని, కానీ, పూర్తి ఫలితాలు రావడానికి అర్ధరాత్రి దాటే అవకాశం ఉందని చెప్పారు. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ నియోజకవర్గాలకు, మొత్తం 24వేల మంది సిబ్బంది కౌంటింగ్‌లో పాల్గొంటున్నారు. వీరికి అదనంగా మరో 3వేల మంది సిబ్బంది అందుబాటులో ఉంటారు.

- మిగతా 3 లో

స్ట్రాంగ్ రూములకు మూడంచెల భద్రత

పోలింగ్ ముగిసింది. ప్రజలిచ్చిన తీర్పు ఈవీఎంలలో నిక్షిప్తమైంది. ఎంపీ, ఎమ్మెల్యేల భవిష్యత్తును నిర్ణయించే ఈవీఎంలు, వీవీప్యాట్‌లను స్ట్రాంగ్‌రూంలకు తరలించారు. ఓట్లు లెక్కించే మే 23న వాటిని తెరుస్తారు.

మూడంచెల భద్రత

ఓట్లు పోలైన ఈవీఎంలు, వీవీప్యాట్‌లను భద్రపరిచే గదులను స్ట్రాంగ్‌రూమ్‌లంటారు. ఆయా జిల్లా కేంద్రాల్లో వీటిని ఏర్పాటు చేస్తారు. పోలింగ్ ముగిసిన వెంటనే ఈవీఎంలను స్ట్రాంగ్‌రూంలకు తరలిస్తారు. కౌంటింగ్ రోజు ఉదయం మాత్రమే ఆ గదులను తెరిచి ఈవీఎంలను కౌంటింగ్ కేంద్రాలకు తరలిస్తారు. అప్పటివరకు ఈవీఎంలు స్ట్రాంగ్‌రూంలోనే ఉంటాయి.

స్ట్రాంగ్‌రూమ్‌లకు రెండు తాళాలు వేయాలి. ఒక కీ (తాళం చెవి) జిల్లా ఎన్నికల అధికారి వద్ద, రెండోది నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వద్ద ఉంటుంది. స్ట్రాంగ్‌రూం తలుపులు, కిటికీలు పూర్తిగా మూసివేయాలి. ఎవరూ లోపలికి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలి. స్ట్రాంగ్‌రూమ్‌ల దరిదాపులకు ఎవరూ రాకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాటు చేయాలి. దీనికోసం మూడెంచల భద్రత ఉంటుంది. గది బయట మొదటి అంచెలో ఒక ప్లాటూన్ కేంద్ర బలగాలు రక్షణగా ఉంటాయి. ఒక ప్లాటూన్‌లో 30 నుంచి 50 మంది సైనికులు ఉంటారు. వీరి విధులకు సంబంధించి లాగ్‌బుక్ నిర్వహించాలి.

ఆ తర్వాత రెండు అంచెల్లో రాష్ట్ర పోలీసులు పహారా కాస్తుంటారు. భద్రతా సిబ్బంది మూడు షిఫ్టుల్లోనూ పని చేయాల్సి ఉంటుంది. స్ట్రాంగ్‌రూం భద్రతా ఏర్పాట్లను 24 గంటలూ పరిశీలించేందుకు ఒక సీనియర్ అధికారితో పాటు ఒక గెజిటెడ్ అధికారిని నియమించాలి. అగ్నిప్రమాదం జరిగితే వెంటనే ఆర్పివేసేలా స్ట్రాంగ్‌రూం లోపల, వెలుపల తగినన్ని అగ్నిమాపక యంత్రాలు ఏర్పాటు చేయాలి.

స్ట్రాంగ్ రూం పరిశీలనకు వచ్చే అధికారులు మినహా మరెవరినీ అక్కడికి అనుమతించరు. స్ట్రాంగ్ రూంలకు వెళ్లే మార్గం మొత్తం నిఘా నీడలో ఉంటుంది. స్ట్రాంగ్ రూం ద్వితీయ భద్రతా వలయాన్ని దాటే ప్రతీ వ్యక్తి వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలి. జిల్లా ఎన్నికల అధికారులు, జిల్లా ఎస్పీ, అభ్యర్థులతో పాటు పోలింగ్ ఏజెంట్లందరికీ ఈ నిబంధన వర్తిస్తుంది.

రిటర్నింగ్ అధికారి ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో స్ట్రాంగ్‌రూం ప్రాంగణాన్ని సందర్శించి, లాగ్ బుక్‌ను, సీసీటీవీ ఫుటేజ్‌ని పరిశీలించాలి. ఒకవేళ స్ట్రాంగ్‌రూంలు జిల్లా కేంద్రంలో ఉంటే జిల్లా ఎన్నికల అధికారి ఆ బాధ్యత తీసుకోవాలి. ఏ రోజు ఎవరు వచ్చి తనిఖీ చేశారన్నది లాగ్‌బుక్‌లో నమోదు చేయాలి. ఈవీఎంలు స్ట్రాంగ్‌రూంలో ఉన్నంత కాలం అక్కడ నిరంతరాయ విద్యుత్ సరఫరా ఉండాలి. స్టాండ్‌బైగా జనరేటర్లను అందుబాటులో ఉంచుకోవాలి. పోటీ చేసిన అభ్యర్థులందరికీ ఉన్నతాధికారుల ఫోన్ నెంబర్లు ఇవ్వాలి. అభ్యర్థులు ఆ నెంబర్లను స్ట్రాంగ్ రూంల వద్ద ఉన్న తమ ఏజెంట్లకు అందించాలి. అత్యవసర పరిస్థితుల్లో ఈ నెంబర్లను సంప్రదించమని చెప్పాలి.

వాహనాలకు అనుమతి లేదు

మంత్రులు, అభ్యర్థులు, అధికారుల వాహనాలను మూడో అంచెలోకి రాకముందే నిలిపివేయాలి. ఆ తర్వాత ఎవరైనా సరే అక్కడి నుంచి నడుచుకుంటూనే స్ట్రాంగ్ రూం వరకు వెళ్లాలి. వాహనాల పార్కింగ్ మార్కింగ్ స్పష్టంగా కనిపించేలా ఉండాలి.

ఓట్ల లెక్కింపు రోజున స్ట్రాంగ్‌రూంని అభ్యర్థులు లేదా వారి ప్రతినిధులు, రిటర్నింగ్ అధికారి, పరిశీలకుడి సమక్షంలో వీడియో చిత్రీకరణ మధ్య తెరవాలి. స్ట్రాంగ్ రూం నుంచి కంట్రోల్ యూనిట్లను కౌంటింగ్ కేంద్రాలకు తరలించడాన్ని వీడియో చిత్రీకరణ చేయాలి. అభ్యర్థుల ఏజెంట్లు సీసీటీవీ ద్వారా స్ట్రాంగ్‌రూంని గమనించేందుకు అనుమతించాలి. ఓట్ల లెక్కింపు తర్వాత కంట్రోల్ యూనిట్లకు సీల్ వేయాలి. ఈ ప్రక్రియ అనంతరం ఈవీఎంలను తిరిగి స్ట్రాంగ్‌రూంకి తరలించాలి.

- బోస్

రాజధాని వార్తలు కలం

ఏవీ ఎర్రజెండా రెపరెపలు ?

కమ్యూనిజం అనే పదం కమ్యూనిస్ అనే లాటిన్ పదం నుంచి వచ్చింది. దీనికి 'అందరికీ చెందిన' అని అర్థం వస్తుంది. ఈ భావన గ్రీకుల కాలం నుంచి ఉంది. కమ్యూనిజం ముఖ్య ఆశయం వర్గ, ఆర్థిక, సామాజిక తారతమ్యాలు లేని సమసమాజ స్థాపన. ఉత్పత్తికేంద్రాల, వనరుల ఉమ్మడి యాజమాన్యం అనేది కమ్యూనిజం మూలసూత్రం. మొట్టమొదట ఫ్రాన్స్ దేశంలో కమ్యూనిస్ట్ పార్టీకి ఎన్నిక అయిన సభ్యులు, ప్రతినిధులు, శాసన సభలో స్పీకరుకు ఎడమ వైపున కూర్చుండేవారట. అందుకని వారిని "లెఫ్టిస్టులు" (వామ పక్షాలు) అని పిలవటం పరిపాటైనది. ఇప్పటికీ కమ్యూనిస్టులను "లెఫ్టిస్ట్" లనే వ్యవహరిస్తున్నారు. మానవుడు సంఘ జీవిగా పరిణామ క్రమానికి మూలం శ్రమ విభజన. అందరూ అన్ని పనులు చెయ్యలేరు, తమకు కావలిసిన వస్తువులు వసతులు తమకు తామే సమకూర్చుకోలేరు. అందువలన, సమాజంలో క్రమంగా శ్రమ విభజన అంతర్లీనంగా పరిణామం చెందినది. ఈ పరిణామ క్రమంలో అనేక అసమానతలు ఏర్పడతాయి. ఇటువంటి అసమానతలను పొగొట్టే అవకాశాలను పొందుపరిచి తద్వారా మానవుడి సంఘ జీవన విధానాన్ని సంస్కరించే ప్రయత్నమే కమ్యూనిజం అని చెప్పుకోవచ్చు. క్రీ.పూ.300లో గ్రీకు తత్వవేత్త అయిన ప్లేటో తన 'ద రిపబ్లిక్' గ్రంథంలో ఈ విధమైన భావన గురించి మొదటిగా చర్చించాడు.

భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) 1925 డిసెంబరు 26న ఆవిర్భవించింది. స్వాతంత్ర్యం సమరంలో ముమ్మరంగా పాల్గొని ప్రజల అభిమానాన్ని చూరగొంది. సిద్ధాంతాల విభేదాలతో 1964లో సీపీఐ నుంచి విడివడి కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ మార్క్సిస్టుగా రూపొందింది. కాలక్రమంలో అనేక సార్లు వామపక్షాలు చీలిపోతూ, విడిపోతున్నాయి. వీటన్నింటిని ఏకం చేయాలన్న సంకల్పం పార్టీ శ్రేణుల్లో ఉన్నప్పటికీ విభేదాలతో అస్థిత్వాన్ని కోల్పోతోంది. స్వాతంత్ర్యం తర్వాత కాంగ్రెస్‌కు గట్టి పోటీ ఇచ్చి ప్రతిపక్షంగా నిలిచిన కమ్యూనిస్టులు కాలక్రమేణా ప్రాభవాన్ని కోల్పోయారు. ముందుతరం నాయకులు వారి ఆస్తులు, ప్రాణాలు సిద్ధాంతాల కోసం ధారపోస్తే, ప్రస్తుతరం కమ్యూనిస్టుల నుంచి కేపిటలిస్టులుగా మారి నిబద్ధతకు సమాధికట్టడంతో ఈ పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ఎదగాల్సిన కమ్యూనిస్టులు చారిత్రాత్మక తప్పిదాల పరంపరలో పాతాళానికి పడిపోవడంతో మతోన్మాద శక్తులు అధికారంలోకి వచ్చాయి. జాతీయవాదం, దేశభక్తిపేరుతో మైనార్టీలను, దళితులు, మేధావులు, సామాజికవేత్తలను అణగదొక్కుతున్నా.. రాష్ట్ర అసెంబ్లీలోనూ, భారత పార్లమెంటులోనూ తమ గళాలను వినిపించేవారే లేకుండా పోయారు. ప. బెంగాల్‌లో జ్యోతిబసు, త్రిపురలో మాణిక్ సర్కార్, ప్రజారంజక పాలనచేపట్టారు. తర్వాత కాలంలో ఆరెండు రాష్ట్రాల్లో అధికారం కోల్పోగా, ప్రస్తుం దేశంలో ఒకే ఒక్కచోట కేరళలో మాత్రమే వామపక్షపార్టీ పాలనలో ఉంది. అధికార బీజేపీ ఎన్ని కుతంత్రాలు పన్నినప్పటికీ కేరళ ముఖ్యమంత్రి పినరాయి విజయన్ నిబ్బరంగా, పారదర్శక పాలన అందిస్తున్నారు. ఇక మన రాష్ట్రానికి వస్తే,ఇక్కడంతా చారిత్రాత్మక తప్పిదాలే.. కనిపిస్తాయి. దీంతో అసెంబ్లీలో ఒక్క సభ్యుడు లేకుండా పోయాడు. దీనికి తోడూ కుల, మత బేధాలు కూడా వామపక్షాల్లో చోటు చేసుకోవడం ద్వారా దళితులకు చోటు లేకుండా పోయిందన్న వాదనలు వైరల్ అయ్యాయి.

ఎక్కడైతే సమానత్వం, సమాన అవకాశాలు ఉంటాయో అక్కడ శాంతి భద్రతలు వెల్లివిరుస్తాయి. శాంతి భద్రతలు ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుంది. లేకుంటే అడుగడుగున పోరాటాలు, హింస, మానవ వినాశనానికి దారి తీస్తుంది. వామపక్షాలు నిర్వహించిన ఒక సభలో ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ ఈనాడు దేశంలోనూ, రాష్ట్రంలోనూ ఏర్పడిన అప్రజాస్వామిక చర్యలన్నింటికీ వామపక్షాలే కారణమనడం గమనార్హం. వామపక్షాలు ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని వారి త్యాగాలను గుర్తు చేసుకుంటూ అనైతిక పొత్తులు, అనవసర మిత్రత్వాలు నడపకుండా ప్రజలతో కలసి ముందడుగు వేయాలని కోరుతున్నాం..



లక్ష్మీస్ ఎన్టీఆర్

(మొదటిపేజీ తరువాయి)

కూడగట్టి, ఎన్టీఆర్‌ను ముఖ్యమంత్రి పీఠం నుండి కూలదోసి తాను ముఖ్యమంత్రి అయ్యాడన్న అనుమానాన్ని ప్రజల్లో కలిగించారు. చంద్రబాబు ఆ పరిస్థితుల్లో అలా చేసి పార్టీని బతికించుకోవాల్సి వచ్చిందని చంద్రబాబు వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. ఏది ఏమైనా తాను అంత త్వరగా ముఖ్యమంత్రి పీఠం ఎక్కుతానని చంద్రబాబు ఊహించి ఉండరు. ఇందుకుగాను దీని కంతటికి కారకురాలైన లక్ష్మీ పార్వతికి చంద్రబాబు ప్రతి రోజూ మనసులో దండం పెట్టుకునే ఇంట్లోంచి బయలు దేరాలి. చరిత్రను ఉన్నదున్నట్లు ఎంతో గట్స్‌తో తెరకెక్కించిన రామ్‌గోపాల్ వర్మ పాత్రల అసలు పేర్లు మార్చాల్సిరావడం ఏం బాలేదు. ఉదాహరణకు తెలుగుదేశం పార్టీని మన దేశం పార్టీగా, బుచ్చయ్య చౌదరిని అచ్చయ్య చౌదరిగా, దేవేంద్రగౌడ్‌ను వీరేంద్రగౌడ్‌గా, లోకేష్‌ను ఆకాష్‌గా, చంద్రబాబును బాబు, సిబి నాయుడుగా ఇలా. తన భార్య లక్ష్మీ పార్వతి ఎన్టీఆర్ అంతటి మహానటుడు, మహా నాయకుడి జీవిత చరిత్ర రాయబోతుందని అమాయకంగా నమ్మిన వీరగంధం వెంకట సుబ్బారావు అనుకున్నదొకటి అయినదొకటి జరిగి మొదటికే మోసం వచ్చింది. చూసే ప్రేక్షకుడికి పాపం వీరగంధం వెంకట సుబ్బారావు అనిపిస్తుంది.

ఎన్టీఆర్ లక్ష్మీ పార్వతిని పెళ్ళాడాక జరిగిన ఎన్నికలలో అఖండ మెజారిటీతో గెలిచిన రాత్రి ఎన్టీఆర్, లక్ష్మీ పార్వతి డాన్స్ చేయడం ఎబ్బెట్టుగా ఉంది. ఎన్టీఆర్ చనిపోయిన రోజు హరికృష్ణ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రవాణా శాఖ మంత్రి హోదాలో చైనాలో పర్యటిస్తున్నారు. ఆయనకు తండ్రి మరణించిన కబురు వెళ్ళింది. ఆయన హైదరాబాద్‌కు తిరిగొచ్చేలపు ఎన్టీఆర్ భౌతికాయాన్ని ప్రజల సందర్శనార్థం హైదరాబాద్ లాల్ బహదూర్ స్టేడియంకు తరలించారు. ఎన్టీఆర్ శవం దగ్గర లక్ష్మీపార్వతి, ఆమె తల్లి సామ్రాజ్యం ఉన్నారు. బైరతాబాద్ తెలుగుదేశం నాయకుడు, లక్ష్మీపార్వతి అనుయాయుడు విజయకుమార్ యాదవ్, ఆయన శిష్య గణం ఎన్టీఆర్ శవం దగ్గరికి ఎన్టీఆర్ కుటుంబ సభ్యులనెవరినీ అనుమతించలేదు. లక్ష్మీపార్వతి ఎన్టీఆర్ గుండెల మీద పడుకుని ఏడుస్తూ లేవడం లేదు. ఎన్టీఆర్ కొడుకులు, కూతుళ్ళు వాళ్ళ తండ్రి భౌతిక కాయానికి దూరంగా కూర్చొని బిక్కుబిక్కుమంటూ ఏడుపు దిగమింగుకుని కూర్చున్నారు. అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు ఎస్ఎపీ యం.డి రూమ్‌లో కూర్చుని ఇదంతా "మనకెందుకులే" అన్నట్లు ప్రేక్షక పాత్ర పోషించారు. చైనా నుండి హరికృష్ణ ఎల్.బి స్టేడియంకు వచ్చేసరికి సీనంతా మారిపోయింది. జరిగింది, జరుగుతున్నది తన తోబుట్టువుల నుండి తెలుసుకున్న హరికృష్ణ పెడబబ్బలతో హుంకరించే సరికి విజయకుమార్ యాదవ్ బృందం, లక్ష్మీపార్వతి, ఆమె తల్లి సామ్రాజ్యం కుక్కిన పేనుల్లా తలో మూలకి వెళ్ళి పోయారు. అప్పుడు మాత్రమే ఎన్టీఆర్ పిల్లలు, మనవలు,మనవరాళ్ళు, కోడళ్ళు ఎన్టీఆర్ భౌతిక కాయం దగ్గరకు రాగలిగారు. ఇదంతా అప్పుడు తీసిన వీడియోల్లో చాలా స్పష్టంగా ఉంది. వాస్తవం ఇలా ఉండగా ఎన్టీఆర్ చనిపోగానే హరికృష్ణ, ఇతర కుటుంబ సభ్యులు ఎన్టీఆర్ ఉంటున్న ఇంటికి వచ్చి లక్ష్మీపార్వతిని ఒక మూలకు నెట్టేసినట్లు రామ్‌గోపాల్ వర్మ చూపించడం వాస్తవ విరుద్ధం. అంతేకాక, ఎన్టీఆర్ చనిపోయిన ఆ రాత్రి లక్ష్మీ పార్వతి చాలా డబ్బు, నగలు ఆయింట్లో నుండి తరలించిందనీ, వాటిని తనకు నమ్మకస్తులు అనుకున్న వాళ్ళకు దాయమని ఇచ్చిందనీ ఆ తర్వాత వాళ్ళు వాటిని ఆమెకు తిరిగి ఇవ్వకుండా మోసం చేశారనీ అంటారు. ఇదెంత వరకూ నిజమోతెలియదు. ఇలాంటి విషయాన్ని టచ్ చేయకపోవడం రామ్‌గోపాల్ వర్మ చేసిన మంచి పని.

ఇక పోతే ఒక సాదా సీదా మనిషిని ఎవరైనా చెప్పుతో కొడితేనే చాలా అవమానంగా ఫీలవుతాడు. అలాంటిది స్వాభిమానం చాలా ఎక్కువగా ఉన్న ఎన్టీఆర్ వైశ్రాయ్ హోటల్ దగ్గర తనపైన చంద్రబాబు మనుషులు (వ్యూహం ప్రకారం) చెప్పులు వేయడంతో ఎంతో క్రుంగిపోతారు. అదే దిగులుతో ఉంటారు. "అప్పటి నుండీ నేను ఆనాడే చనిపోయాను లక్ష్మీ" అంటూ కుమిలి పోతుంటారు. ఇక క్లైమాక్స్‌లో ఎన్టీఆర్ కన్నీరు మున్నీరవడం, అ రాత్రి చనిపోవడం చూసిన ఎన్టీఆర్ అభిమానులుగానీ, ప్రేక్షకులు గానీ చంద్రబాబును తీవ్రంగా అసహ్యించుకుంటారు, ద్వేషిస్తారు. ఇక ఎన్టీఆర్ గా ఈ చిత్రంలో నటించిన రంగస్థల నటుడు విజయకుమార్ ఎన్టీఆర్ బాడీ లాంగ్వేజ్‌ను, హావభావాలను, రాజసాన్ని, గంభీరతను ఒంట పట్టించుకుని మరీ నటించడం వలన ఎన్టీఆర్ బాగా గుర్తొచ్చారు. చంద్రబాబు నాయుడిగా నటించిన శ్రీతేజ్‌ను కొన్ని షాట్స్‌లో చూస్తుంటే చంద్రబాబునే చూస్తున్నామా అనే భ్రమ కలుగుతుంది ప్రేక్షకులకు. పాత్రలకు కరెక్ట్‌గా సరైన నటీనటులను ఎంపిక చేసిన రామ్‌గోపాల్ వర్మ అభినందనీయులు. ఈ సినిమా రచనలో నరేంద్రతో పాటు రామ్‌గోపాల్ వర్మ కూడా చేయి కలిపారు. కళ్యాణి మాలిక్ సంగీతం, రామి ఫోటోగ్రఫీ బావున్నాయి. క్లోజ్ షాట్స్‌లో ఉండే బ్యూటీ, ఇంటెన్సిటీ ఈ సినిమాలో బాగా ఫీలవుతారు ప్రేక్షకులు. ఒక పక్క ఎన్నికల్లో అపజయం, మరోపక్క భార్య బసవరామతారకం మరణం, తనను ఏ మాత్రం పట్టించుకోని పిల్లల వ్యవహారశైలితో కల్లోల మనస్సుతో ఉన్న ఎన్టీఆర్‌కు లక్ష్మీపార్వతి మానసిక ప్రశాంతతను ఇచ్చి "నాకై వచ్చిన నెచ్చెలివి అమృతం తెచ్చిన జాబిలివి" (ఈ పాట ఎన్టీఆర్‌కు ఎంతో ఇష్టం) అన్నట్లు ఎన్టీఆర్ ఫీలవుతారు. ఆ మాటే లక్ష్మీ పార్వతితో పదేపదే అంటారు కూడా. లక్ష్మీ పార్వతి కళ్ళల్లో ఒక చిత్రమైన ఆకర్షణ ఉంటుంది. లక్ష్మీ పార్వతి పాత్ర వేసిన యజ్ఞాశెట్టి కళ్ళలో అంత ఆకర్షణ చూపించలేదు. ఏమైనా ఈ చిత్రంలో లక్ష్మీపార్వతి హీరో (హీరోయిన్ కాదు) అయితే చంద్రబాబు విలన్. ఈ సినిమా ఈ ఎలక్షన్ టైమ్‌లో ఆంధ్రప్రదేశ్ లో గనుక రిలీజై ఉంటే తెలుగుదేశం ఓటు బ్యాంకుకి తూట్లు పడి ఉండేవి. పార్టీలో ఉన్న ఎన్టీఆర్ అభిమానులు, తటస్థులు తెలుగుదేశం పార్టీకి దూరంగా జరిగి ఉండేవాళ్ళు. ఈ సినిమా ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలయ్యే వరకు విడుదల కాకపోవడంతో చంద్రబాబు నెత్తిన హైకోర్టు తీర్పుతో పాలు పోసినట్లయింది. తెలుగు జాతి ఉన్నంత వరకూ ఎన్టీఆర్ సదా స్మరణీయులే. ఆయన్ను ఎవరు బాధ పెట్టినా, తెలుగు జాతిని బాధపెట్టినట్లే. ఈ సినిమాతో రామ్ గోపాల్ వర్మ ఇచ్చిన సందేశం ఇదే!

- హరిణాంక్

మే1న లక్ష్మీస్ ఎన్టీఆర్ విడుదల

హైదరాబాద్ : దర్శకుడు రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన 'లక్ష్మీస్ ఎన్టీఆర్' ను మార్చ్ 29న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేసిన సంగతి తెలిసిందే. కానీ సినిమా వివాదాస్పదం కావడంతో టీడీపీ నాయకుడు పీ. మోహన్ రావు, న్యాయవాది నువ్వారి శ్రీనివాసరావు సినిమా విడుదలను ఆపాలని కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. దీంతో ఆంధ్రప్రదేశ్ లో ఎన్నికలు పూర్తయ్యే వరకూ రిలీజ్ పై కోర్టు స్టే విధించింది. 'లక్ష్మీస్ ఎన్టీఆర్' టీమ్ దీనిపై అప్పటినుంచి న్యాయ పోరాటం చేస్తున్నారు. ఎపీలో ఇప్పుడు ఎలెక్షన్స్ పూర్తయ్యాయి కాబట్టి 'లక్ష్మీస్ ఎన్టీఆర్' విడుదలకు నిర్మాతలు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తన ట్విట్టర్ ఖాతా ద్వారా మే 1 న రిలీజ్ అంటూ లక్ష్మీస్ ఎన్టీఆర్ రిలీజ్ డేట్ పోస్టర్ ను షేర్ చేశాడు. దీనికి తోడుగా "ఫైనల్ గా లక్ష్మీస్ ఎన్టీఆర్ మే1 న ఆంధ్ర ప్రదేశ్ లో రిలీజ్ అవుతోంది. మీరందరూ వచ్చి ఎన్టీఆర్ వెనక జరిగిన కుట్రలను వచ్చి చూడండి" అంటూ ట్వీట్ చేశారు. అయితే మే 1 న విడుదల అని చెప్తున్నా నిజంగా విడుదల అయ్యే వరకూ నమ్మకం లేదనే టాక్ వినిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్లో కొన్ని పోలింగ్ బూత్ లలో రీ-పోలింగ్పై జరుపుతారా లేదా అనే విషయంలో ఇంకా కేంద్ర ఎన్నికల సంఘం నుంచి క్లారిటీ రావలసి ఉంది. మరి ఈ కారణం సాకుగా చూపి 'లక్ష్మీస్ ఎన్టీఆర్' విడుదలను అడ్డుకునే అవకాశం ఉందని అంటున్నారు. ఏ విషయం మనకు ఒకటి రెండ్రోజుల్లో తెలిసే అవకాశం ఉంది.

ఢిల్లీలో చంద్రబాబు మరో దీక్ష

(మొదటిపేజీ తరువాయి)

వ్యతిరేకంగా ఫలితాలు వచ్చినా.. ఏపీలో అసెంబ్లీ ఫలితాలే చంద్రబాబు రాజకీయంగా తీసుకొనే తదుపరి నిర్ణయాలకు కీలకం కానున్నాయి. జాతీయ స్థాయిలో తిరిగి మోడీ అధికారంలోకి వస్తే..ఏపీలో టీడీపీ అనుకూల ఫలితాలు వస్తే ఎటువంటి ఇబ్బంది లేకుండా చంద్రబాబు రాజకీయ ంగా ముందుకెళ్లే అవకాశం ఉంది. అదే సమయంలో..ఫలితాలు వ్యతిరేకంగా వస్తే మాత్రం 40 ఏళ్ల అనుభవం ఉన్న చంద్రబా బు రాజకీయంగా ఎటువంటి అడుగులు వేస్తారనేది మాత్రం ఆసక్తి కరమే..

మే4న శ్రీ త్యాగరాజు జయంతి

రాజధాని వార్తలు, అమరావతి : మే 4 న వాగ్గేయకారుడు కర్ణాటక సంగీత స్రష్ట శ్రీ త్యాగరాజు 252 వ జయంతి. ప్రపంచ ప్రఖ్యాతి పొందిన త్యాగరాజు కీర్తనలు తెలుగుభాషలో రచించారు. తమిళనాడుతో సహా కొన్ని రాష్ట్రాలు, దేశాలలో శ్రీ త్యాగరాజ వర్ధంతి సందర్భంగా జనవరిలో ఏటా శ్రీ త్యాగరాజ ఆరాధనోత్సవాలు భారీ స్థాయిలో జరుగుతాయి. **తెలుగువాడైన త్యాగరాజ జయంతి ఉత్సవాలు రాష్ట్రప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సంగీత అభిమానులు చేసిన విజ్ఞప్తిని రాష్ట్రప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయం.**

అంతర్జాతీయ నృత్య దినోత్సవ వేడుక ఆహ్వానం

కె.యస్. గోవిందరాజన్

రాజధాని వార్తలు, విజయవాడ : ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ (ఆం.ప్ర. సృజనాత్మకత మరియు సంస్కృతి సమితి) ఆధ్వర్యంలో శ్రీమతి గోకరాజు లైలాగంగరాజు కళావేదికలో ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల అంతర్జాతీయ నృత్య దినోత్సవ వేడుక సోమవారం సాయంత్రం జరుగనుంది. ఈ కార్యక్రమంలో శ్రీ వేదాంతం రామలింగశాస్త్రి, కేంద్ర సంగీత నాటక అకాడమి అవార్డు గ్రహీత షేక్ ఖలీల్‌కి గురు సత్కారము నిర్వహించడం జరగనుంది. విజయవాడ నాట్య గురువుల విద్యార్థులచే నృత్య ప్రదర్శనలు జరుగును. ఈ వేడుకకు అందరూ హాజరై విజయవంతం చేయాలని కె.యస్. గోవిందరాజన్, ఘంటసాల వెంకటేశ్వరరావు కోరారు.

అధికారం దక్కేది ఏ ఓటుతో ...?

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభమైనా, ఆతర్వాత పరిస్థితులు మారి భారీ స్థాయిలో ఓటర్లు తరలి వచ్చారు. తిరిగి వెళ్ళిన ఓటర్లు మళ్ళీ వచ్చి ఓటు వేయాలని ముఖ్యమంత్రి పదే పదే టివీల ద్వారా విజ్ఞప్తి చేశారు. ఓటర్లు భారీగా తరలి రావడంతో రాత్రి 12 గంటల దాకా కొన్ని చోట్ల తెల్లవారుజాము వరకు పోలింగ్ జరిగింది. అత్యధిక శాతం ఓట్లు నమోదయ్యాయి. భారీ పోలింగ్ ప్రభుత్వ వ్యతిరేకతకు చిహ్నమని విశ్లేషకుల ప్రచారం. హెచ్చు శాతం పోలింగ్ అయినప్పుడు ప్రతిపక్షానికి అధికారం దక్కిన సందర్భాలు ఉన్నాయి. ఈ అంచనాతోనే భారీస్థాయిలో వైకాపా గెలువనున్నట్లు ఆ పార్టీ నేతలే కాక కొందరు విశ్లేషకులు కూడా అంచనా వేశారు.

ఈ అంచనాలను మరికొందరు విశ్లేషకులు కొట్టిపారేస్తున్నారు. ఇటీవల తెలంగాణా శాసనసభకు జరిగిన ముందస్తు ఎన్నికలలో భారీ పోలింగ్ జరిగినా తెరాస అత్యధిక స్థానాలను గెలుచుకున్నాయని వారు ప్రస్తావిస్తున్నారు. ఇక్కడ కూడా తెలుగుదేశం భారీ స్థానాలు దక్కించుకోవచ్చు కదా అంటున్నారు. ఎన్నికలకు ముందు తెలంగాణా ముఖ్యమంత్రి కే. చంద్రశేకర్ రావు ప్రకటించిన రైతుబందు, కళ్యాణ లక్ష్మి, పెన్షన్ వంటి పథకాలు ముందస్తు ఎన్నికలలో తెరాస ఘన విజయానికి కారణమని విశ్లేషణలు వచ్చాయి.

తెలంగాణా పరిణామాలను దృష్టిలో ఉంచుకొనే ప్రధాని మోదీ నేతృత్వంలోని భాజాపా కూటమి, తెలుగుదేశం ప్రభుత్వం మరికొన్ని రాజకీయ పార్టీలు భారీ స్థాయిలో సంక్షేమ పథకాలు ప్రకటించాయి. ఆంధ్రప్రదేశ్ లోనూ, కేంద్రంలోనూ కొన్ని పథకాల మొదటివిడత డబ్బులుకూడా ప్రజల ఖాతాలో చేరాయి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మరో అడుగు ముందువేసి అనేక వర్గాలకు - ముఖ్యంగా మహిళలు, యువకులు, రైతులకు పలు ప్రోత్సాహకాలు ప్రకటించిన విషయం విదితమే.

ఈ కారణంగానే ఈవీయంల సమస్య తలెత్తినా రాత్రిదాకా సాగిన పోలింగ్‌లో భారీ స్థాయిలో ఓటర్లు - ముఖ్యంగా మహిళలు పాల్గొన్నారని పరిశీలకులు పేర్కొంటున్నారు. గంటలకొద్దీ క్యూ లలో నిలబడి వేసిన ఓట్లు "అంకిత ఓటు" అనే విశ్లేషణలో వచ్చాయి. ఇందువల్ల తెలుగుదేశం భారీ స్థాయిలో విజయం సాధించడం తథ్యమని విశ్లేషణలు వచ్చాయి.

ఈ విశ్లేషణలను వైకాపా వర్గాలు కొట్టిపారేశాయి. ఉదయం పోలింగ్ ప్రారంభమైన తరువాత ఈవీయం లు మొరయించాయనే వార్తలు ఓటర్లలో ఆందోళనను, రాష్ట్రప్రభుత్వంపై అనుమానాలను కలిగించాయని, పోలింగ్ శాతం తగ్గించడానికి కుట్రలు జరుగుతున్నాయనే అనుమానాలను కలిగించాయి. ఈ కారణంగా ఓటర్లు భారీగా తరలివచ్చి గంటలకొద్దీ క్యూలలో నిలబడి ఓటింగ్ లో పాల్గొనడం ప్రభుత్వ వ్యతిరేకతకు చిహ్నమని, ఇది "నిశ్శబ్ద" ఓటని వైకాపా వర్గాలు పేర్కొన్నాయి. ఓటర్లు భారీగా తరలివచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓట్లు వేసినందున వైకాపా 120-130 స్థానాలలో భారీస్థాయిలో విజయం సాధిస్తుందని వైకాపా వర్గాల విశ్వాసం.

ఈ అంచనాలు తప్పని రాష్ట్రంలో జరిగిన పోలింగ్ సరళి ప్రజలు "మార్పు" కోరుతున్నారనే స్పష్టమైన సంకేతాన్ని ఇచ్చిందని మరికొందరి విశ్లేషకుల వాదన. ప్రజలు మార్పు కోరడం పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని జనసేనకు అనుకూలమని ఈ విశ్లేషకుల అభిప్రాయం. జనసేన అధికారంలోకి వచ్చినా, రాకపోయినా జనసేనకు పడిన ఓట్లు రాబోయే ప్రభుత్వాన్ని నిర్ణయిస్తాయని విశ్లేషకులు చెబుతున్నారు. జనసేనకు వచ్చిన ఓట్లు ఒక పార్టీ విజయానికి దోహదపడుతున్నాయని వీరు అంటున్నారు. జనసేన ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను చీల్చిందని, ఇందువల్ల తెలుగుదేశం పార్టీకి లాభం చేకూరుతుందని చాలామంది భావిస్తున్నారు. జనసేన ప్రభుత్వవ్యతిరేక ఓట్లను మాత్రమే చీలుస్తుందనే వాదన సరికాదని, కులంతో సహా ఇతర కారణాలవల్ల తెలుగుదేశం అనుకూల ఓట్లు కూడా జనసేనకు వచ్చాయని ఇందువల్ల లాభపడేది వైకాపా అని చెబుతున్నవారూ ఉన్నారు.

ఎదిఎమైనా పోలింగ్ పూర్తైన తరువాత 40 రోజులకుపైగా వేచిఉండవలసి రావడం రాజకీయ పక్షాలకే కాదు

వయస్సు 12.. బీఎండబ్ల్యూ కారు..

కలిసొచ్చేకాలానికి నడిచివచ్చే కొడుకు పుడతారంటారు. థాయ్‌లాండ్‌కు చెందిన జంటకు అలాంటిదే జరిగింది. 12 ఏళ్ల కూతురు ఎకాఎకిన బీఎండబ్ల్యూ కారు కొని ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేసింది. ఇంతకీ ఆమె కొన్నది అమ్మానాన్న డబ్బులో...వారసత్వ ఆస్తితోనే కాదు.. అంతా చిన్నారి కష్టార్జితమే.. నమ్మశక్యంగా లేకున్నా.. ఇది నిజం.. పూర్తిగా తెలుసుకోవాలంటే చదవండి..

థాయ్‌లాండ్‌కు చెందిన 12 ఏళ్ల అమ్మాయి పేరు నాథనన్. పేరుకే చిన్న పిల్లగాని పెద్దలకు ఉండాల్సిన అన్ని తెలివి తేటలూ ఉన్నాయి. మూడేండ్ల వయస్సు నుంచే ఈ అమ్మాయికి మేకప్ అంటే చాలా ఇష్టం. చిట్టిచిట్టి చేతులతో తనపైనా, తన ఇంట్లో వాళ్లపైనా ప్రయోగాలు చేసేది. ఏడేండ్ల వయస్సులో మేకప్ గురించి ప్రొఫెషనల్ కోర్సులు చేసింది. తన ప్రతిభను సోషల్‌మీడియాలో పరీక్షించుకుంది. మేకప్‌లో తాను తెలుసుకున్న చిట్కాలను యూట్యూబ్‌తోపాటు వివిధ నెట్ వర్కింగ్ సైట్లలో అప్‌లోడ్ చేసేది. దీంతో నాథనన్ యూట్యూబ్ చానెల్‌కు 2,82,000 మంది సబ్‌స్క్రైబర్లు అయ్యారు. చాలామంది కష్టమర్లు ఇంటికే వచ్చేస్తున్నారు. దీంతో నాథనన్ మేకప్ ఆర్టిస్టుగా

ఆమె

మారిపోయింది. డబ్బులు దండిగా వచ్చేస్తున్నాయి. 2018లో లండన్ ఫ్యాషన్ వీక్‌కు ఎంపికై సంచనలం సృష్టించింది. ఈ ఏడాది ఏప్రిల్ 8న తన 12వ పుట్టిన రోజున కష్టార్జితంతో కొన్న బీఎండబ్ల్యూ సెడాన్ కారుతో దిగిన ఓ ఫొటోను సోషల్‌మీడియాలో అప్‌లోడ్ చేసింది. మీ అందరి దీవెనలతో ఈ స్థాయికి వచ్చాను అంటూ వినయంగా చెప్పింది నాథనన్. ఈ ఫొటో కొన్ని గంటల్లోనే వైరల్‌గా మారింది. ఇదండీ 12 ఏళ్ల అమ్మాయి విజయగాథ.

కాబోయే టీటీడీ ఛైర్మన్ అమర్‌నాథ్ రెడ్డి ?

రాజధాని వార్తలు, హైదరాబాద్ : జగన్ అధికారంలోకి వస్తే టీటీడీ ఛైర్మన్ ఎవరేనేది తెలిపోయింది.. పక్కా సమాచారం ఆధారంగా.. వైసీపీ నేత - రాజంపేట మాజీ ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డికి ఈ విషయంపై జగన్ స్పష్టమైన హామీ ఇచ్చేశారట.. మొన్నటి ఎన్నికలకు ముందు టీడీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే మేడా మల్లి కార్జున రెడ్డి రాకతో అమర్ నాథ్ రెడ్డికి వైసీపీ సీటు దక్కలేదు.. జగన్ను - పార్టీని నమ్ముకున్నందుకు ఇదేనా బహుమానమంటూ అమర్ నాథ్ రెడ్డి అసహనం వ్యక్తం చేసినా, జగన్ హామీకి కట్టుబడి చల్లారబడ్డారు.ఎమ్మెల్సీ చేస్తానని జగన్ హామీ ఇవ్వగా, తనకు టీటీడీ ఛైర్మన్ గా చేయాలని ఉందని అమర్ నాథ్ రెడ్డి తన ఇష్టాన్ని బయటపెట్టారట.. ఇక ఏం ఆలోచించకుండా.. మనమే అధికారంలోకి వస్తున్నాం.. నువ్వే కాబోయే టీటీడీ ఛైర్మన్ అంటూ పార్టీ పెద్దనాయకుల ముందే స్పష్టంగా చెప్పేశారట.. అయితే రాజకీయాల్లో నేతల హామీలు నీటి రాతలైన సందర్భాలూ ఉన్నాయి.. కానీ ఈ మధ్య కోస్తా జిల్లాకు చెందిన ఓ సీనియర్ నేత తనకు టీటీడీ ఛైర్మన్ గా నియమించాలని పార్టీ ఫండ్ గా చాలా మొత్తం సమర్పించుకుంటానని, జగన్ కు ఆఫర్ చేశారట.. అన్నా .. ఆ విషయం మర్చిపోండి.. అమర్ నాథ్ రెడ్డి అన్నకు మాట ఇచ్చేశా.. కాబోయే టీటీడీ ఛైర్మన్ అతనే.. ఇంకెవరూ ఆశలు పెట్టుకోవద్దంటూ కుండబద్దలు కొట్టేశారట జగన్.. దీంతో జగన్ అధికారంలో వస్తే అమర్ నాథ్ రెడ్డి టీటీడీ ఛైర్మన్ కావడం ఖాయమని తెలుస్తోంది...

ఏపీలో ఎన్నికల ఫలితాలు ఆలస్యం : ద్వివేదీ

(మొదటిపేజీ తరువాయి)

ఎవరు ఏ నియోజకవర్గంలోని ఓట్లను లెక్కిస్తారనే విషయం చివరి వరకు రహస్యంగా ఉంటుందని ద్వివేదీ తెలిపారు. మే 15 నుంచి కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ ఇస్తామని, ఆ తరువాత వారికి విధులను అప్పగిస్తామని ద్వివేదీ తెలిపారు. లెక్కింపు కేంద్రాల్లో సౌలభ్యాన్ని బట్టి 10 నుంచి 15 వరకూ కౌంటింగ్ టేబుళ్ళు ఉంటాయని చెప్పారు. వీవీ ప్యాట్ లలోని స్లిప్పుల లెక్కింపునకు ఆరు నుంచి ఏడు గంటల సమయం పడుతుందని అంచనా వేశారు. తొలుత పోస్టల్ బ్యాలెట్, ఆపై సర్వీస్ ఓట్లను లెక్కిస్తామని, ఆపై ఈవీఎంలలోని ఓట్లను, చివరిగా ఎంపిక చేసిన ఐదు వీవీ ప్యాట్ మెషీన్లలోని స్లిప్ లను లెక్కించి, సరిచూసి అధికారిక ఫలితం ప్రకటిస్తామని చెప్పారు.

ప్రణయ్ హత్య కేసులో మారుతీరావుకు బెయిల్

రాజధాని వార్తలు, అమరావతి : సంద్యాల : సంచలనం సృష్టించిన ప్రణయ్ హత్య కేసులో అమృత తండ్రి మారుతీరావుకు బెయిల్ మంజూ రైంది. మారుతీ రావుతోపాటు ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొం టున్న మరో ఇద్దరికి కూడా బెయిల్ మంజూరు చేస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. గత ఏడాది సెప్టెంబరు 14న భార్య అమృతతోపాటు ఆస్పత్రికి వెళ్లివస్తుండగా ప్రణయ్ దారుణ హత్యకు గురయ్యాడు. అమృత తండ్రి తిరునగరి మారుతీరావు సుపారి ఇచ్చి ప్రణయ్‌ని హత్య చేయించినట్టు పోలీసులు కూడా స్పష్టం చేశారు. నిందితులు ఎప్పటికప్పుడు బెయిల్ కోసం పిటిషన్‌లు దాఖలు చేస్తున్నా న్యాయస్థానం తోసిపుచ్చింది. తాజాగా మరోసారి హైకోర్టును ఆశ్రయించగా బెయిల్ మంజూరు చేసింది. మారుతీరావు 7 నెలల నుంచి వరంగల్ సెంట్రల్ జైలులో ఉన్నారు

ఓటమి తెలుసుకొనే చంద్రబాబు చిందులు : వైకాపా నేతలు

రాజధాని వార్తలు, విజయవాడ : ఇటీవల ఎన్నికలలో తన ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారనే విషయం తెలుసుకొనే ప్రజలను ప్రక్కదారి పట్టించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల కమీషన్ తో వివాదానికి దిగారని వైఎస్ఆర్ పార్టీ నేతలు విమర్శిస్తున్నారు. అధికారం నుంచి వైదొలగే లోపు తాను ముడుపులు తీసుకున్న కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడమే చంద్రబాబు సమీక్ష సమావేశాలని నేతల ఆరోపణ. గడచిన ఐదు సంవత్సరాలలో చంద్రబాబు అవినీతి పాలనపై ఆగ్రహంతో ఉన్న ప్రజలు చంద్రబాబును ఇంటికి పంపారని వైకాపా నేతలు అంటున్నారు. చంద్రబాబు జరిపే సమావేశాలన్నీ డబ్బులకోసమే అని వీరి ఆరోపణ. ఓటమి తెలిసికూడా ఇంకా ప్రభుత్వంపై పెత్తనం చెలాయించాలనుకోవడం దుర్మార్గమని వైకాపా నేతల విమర్శ. ప్రజల నిర్ణయాన్ని హుందాగా స్వీకరించి వ్యవహరించవలసినది పోయి తన ఓటమికి ఎన్నికల కమీషన్ పై నెపం వేయాలని చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని వైకాపా నేత మల్లాది విష్ణు అన్నారు. ప్రధాని మోదీకి వ్యతిరేకంగా వివిధ రాష్ట్రాలలో చంద్రబాబునాయుడు చేస్తున్న పర్యటనలు కూడ ప్రజల దృష్టి మళ్ళించడానికే అని ప్రతిపక్షాల ఆరోపణ. ఎన్నికలలో ప్రజాతీర్పును ఎంత మహానాయకుడైనా శిరసావహించక తప్పదని ఇతరులపై ఆరోపణలు చేసినంత మాత్రాన చేసిన అవినీతిని దాచిపెట్టలేమని చంద్రబాబు గ్రహించడం లేదని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. ఎన్నికలలో ఎన్నికల కమీషన్ ప్రమేయ ంతో అధికారుల బదిలీలు గతంలో కూడా జరిగాయని ప్రతిపక్షనేతలు గుర్తు చేస్తున్నారు. అప్పుడు అధికారంలో ఉన్న ముఖ్యమంత్రులేవ్వరూ బదిలీలపై రగడ చేయలేదని వీరు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ లో మాత్రమే ఎన్నికల కమీషన్ జోక్యం చేసుకుందంటే అందుకు ప్రధాన బాధ్యత వహించవలసింది చంద్రబాబే అని వైకాపా నాయకులు అంటున్నారు. ఫలితాల తర్వాత చంద్రబాబు పదవి పోవడమే కాదు, చేసిన అవినీతికి శిక్ష అనుభవించక తప్పదని వైకాపా నాయకులు అంటున్నారు.

మోడీకి ఒంగోలు రైతుల షాక్

న్యూఢిల్లీ : ప్రధాని మోడీకి వ్యతిరేకంగా కాశీ నుంచి పోటీ చేసేందుకు నిజామాబాద్ ఇందూరు రైతులు వారణాసి చేరుకున్నారు. వీరికితోడు.. మరో ఇద్దరు తెలుగు వాళ్లు పోటీచేస్తూ శనివారం నామినేషన్లు దాఖలు చేశారు. వెలిగొండ ప్రాజెక్ట్ ని పూర్తి చేసి ఫ్లోరైడ్ సమస్యని దూరం చేయాలని లక్ష్యంతోనే మోడీకి వ్యతిరేకంగా ఎంపీగా పోటీ చేస్తున్నామని ఇద్దరు తెలుగు రైతులు ప్రకటించారు.తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ కుమార్తె కవితకు వ్యతిరేకంగా దాదాపు 180 మంది రైతులు పోటీ చేసి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించగా, నిజామాబాద్ రైతులను స్ఫూర్తిగా తీసుకున్న ఆంధ్రప్రదేశ్‌లోని పామూరు మండలం బొట్లగూడూరు గ్రామానికి చెందిన వద్దే శ్రీనివాసులు కొల్లూరు రవికిరణ్ శర్మలు వారణాసి లోక్ సభ స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు. వీరికి మద్దతు తెలిపేందుకు పలువురు స్థానికులు కూడా వారణాసికి వెళ్లారు. నామినేషన్ వేసిన అనంతరం వారణాసిలోని కాలభైరవ ఆలయం వద్ద వెలిగొండ పోరాట సాధన సమితి సభ్యులు కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. కనిగిరి ప్రాంతంలోని ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం కలగాలంటే వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి తీరాలన్నారు. ఈ సమస్యను జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు వారణాసి పార్లమెంట్ స్థానానికి నామినేషన్ దాఖలు చేశామని పేర్కొన్నారు. వెలిగొండ ప్రాజెక్ట్ అనేది ప్రకాశం జిల్లా వాసుల చిరకాలవాంచ అని - ఈ ప్రాజెక్టుని పూర్తి చేస్తే.. జిల్లా వాసులకు తాగునీటి సమస్య తీరుతుందని ప్రకటించారు.

దూసుకొస్తున్న ఫణి తుఫాన్

రాజధాని వార్తలు, అమరావతి : ఇప్పటికే అకాల వర్షాలతో అతలాకుతలమవుతున్న ఏపీకి మరో తుఫాన్ ముప్పు పొంచి ఉంది. హిందూ మహా సముద్రానికి ఆనుకుని ఉన్న ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర అల్పపీడనంగా మారింది. దీనికి అనుబంధంగా 5.8 కి.మీ. ఎత్తున ఉపరితల ఆవర్తనం ఆవరించి ఉండడంతో దక్షిణ బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడనుంది. శనివారం ఉదయం నాటికి తుఫాన్‌గా మారే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ తుఫాన్‌కు ఫణి అని నామకరణం చేశారు.తుఫాన్‌గా మారిన తర్వాత శ్రీలంక తీరం వెంబడి వాయువ్య దిశగా కదులుతుంది. 72 గంటల తర్వాత ఈ నెల 30న ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తాంధ్రల మధ్య తీరం దాటే అవకాశం ఉందని వాతావరణశాఖ అంచనావేస్తోంది. తుఫాన్ ప్రభావం ఈ నెల 28 నుంచి మొదలవనుంది. ఉత్తర తమిళనాడుతో పాటు దక్షిణకోస్తాలో ఈదుగాలులు వీచే అవకాశముంది. 28న కృష్ణా, గుంటూరు,ప్రకాశం, నెల్లూరు జిల్లాలో గంటకు 50 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీస్తాయి. 29న కోస్తాతో పాటు రాయలసీమలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముంది. భారీ ఈదురుగాలులతో పాటు పలు చోట్ల పిడుగులు పడే అవకాశమున్నట్లు వాతావరణశాఖ తెలిపింది. తీరం దాటే సమయంలో భారీ వర్షాలు, పెను గాలులు బీభత్సం సృష్టిస్తాయని ఐఎండీ హెచ్చరించింది. ఫణి తుఫాన్ ప్రభావంతో తమిళనాడు, పాండిచేరి తీరప్రాంతాల్లో ఈ నెల 29న భారీ వర్షాలు పడతాయని తెలిపింది. ఏప్రిల్ 30, మే1న తమిళనాడులోని చాలా ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరికలు జారీచేసింది. వాతావరణ శాఖ హెచ్చరికలతో ఇరు రాష్ట్రాల అధికారులు అప్రమత్తమై ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఐతే ఇప్పటికే అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన రైతులు..ఇప్పుడు తుఫాన్ వస్తుందన్న వార్త విని మరింత ఆందోళనపడుతున్నారు.

తుఫాన్... వడగాల్పుల హెచ్చరికలు

విశాఖ : ఓ వైపు తుఫాన్ హెచ్చరికలు, మరోవైపు హడలగొట్టిస్తున్న ఎండతో తెలుగు రాష్ట్రాల ప్రజలు భిన్నమైన పరిస్థితి ఎదుర్కొంటున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం 'ఫణి' తుపాన్‌గా మారి కోస్తా తీరంవైపు దూసుకు వస్తున్న విషయం తెలిసిందే. ఈ కారణంగా రెండు తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఇప్పటికే విశాఖ, హైదరాబాద్ వాతావరణ కేంద్రాలు హెచ్చరికలు జారీచేశాయి. మరోవైపు రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆదివారం, సోమవారం వడగాల్పులు వీచే అవకాశం ఉందని, బయట తిరిగే వారు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ముఖ్యంగా ఉత్తర భారత దేశం నుంచి వీస్తున్న పొడిగాలుల కారణంగా తెలంగాణలో వడగాల్పుల ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉందని హెచ్చరించడం గమనార్హం.

వేలానికి నీరవ్‌మోడీ లగ్జరీ కార్లు

పంజాబ్ నేషనల్ బ్యాంక్ స్కామ్ సూత్రధారి - పాత్రధారి నీరవ్ మోదీకి సంబంధించిన లగ్జరీ కార్లు వేలానికి వచ్చాయి. పదమూడు వేల కోట్ల రూపాయల మొత్తం అప్పులను తీసుకుని నీరవ్ మోడీ పీఎన్బీకి టోపీ పెట్టిపోగా.. ఇప్పుడు అతడి నుంచి కనీసం చిల్లర మొత్తాలను అయినా వసూలు చేసుకునేందుకు ప్రభుత్వ రంగ సంస్థలు ప్రయాస పడుతూ ఉన్నాయి.

అందులో భాగంగా అతడి ఖరీదైన కార్లను వేలానికి ఉంచారు. ఈ కేసులో దర్యాప్తు చేస్తున్న ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ నీరవ్ మోదీ కార్ల వేలం ప్రక్రియను మొదలుపెట్టింది. ఈ మేరకు కోర్టు నుంచి గ్రీన్ సిగ్నల్ పొందిన ఆ సంస్థ అందుకు సంబంధించిన వెబ్ సైట్లో డీలెయిల్స్ ను ఉంచింది.

నీరవ్ మోడీ కార్లలో వేటిని వేలానికి పెట్టింది వాటి వేలం లో ప్రభుత్వం వారి పాట ఎంత.. అనే అంశాలను ఈడీ పేర్కొంది. మొత్తం పదమూడు కార్లను వేలానికి ఉంచినట్టుగా ఈడీ పేర్కొంది. వీటిల్లో రోల్స్ రాయిస్ - మెర్సిడేజ్ బెంజ్ - టయోటా ఫార్చూనర్ - ఇన్నోవా - బ్రియో.. తదితర కార్లు ఉన్నాయట. వీటిల్లో కొన్ని మాత్రమే లగ్జరీ కార్లు. మిగతావి పెద్దవేమీ కావని వాటి పేర్లను బట్టే చెప్పేయవచ్చు. ఒకటీ రెండు కార్లు మాత్రం ఐదారు కోట్ల రూపాయల విలువ చేసేవిలా ఉన్నాయి.

అయితే వేలంలో వాటి ప్రారంభ ధర కేవలం కోటి రూపాయల నుంచినే ఉంది. ఎంతైనా సెకెండ్ హ్యాండ్ కాబట్టి ధర తగ్గిపోయే అవకాశాలున్నాయి. అన్ని కార్లనూ అమ్మినా ఈడీ పదికోట్ల రూపాయలు అయినా సమీకరించగలదా?అనేది ప్రశ్నార్థకమే.

ఈ కేసులో విచారణకు అయిన ఖర్చు మొత్తాలను కూడా ఇలాంటి వేలం పాటల ద్వారా సంపాదించలేరని మాత్రం కచ్చితంగాచెప్పవచ్చు. ఇది వరకూ నీరవ్ మోదీ పెయింటింగ్ కలెక్షన్స్ లను వేలానికి ఉంచగా యాభై కోట్ల రూపాయల వరకూ వచ్చాయట. పదమూడు వేల కోట్ల రూపాయల స్కామ్ విషయంలో అది కూడా చిల్లరే అని చెప్పవచ్చు!

'కాంచన 3' రూ.100 కోట్ల కలెక్షన్లు



ప్రభాస్‌తో 'రెబల్' సినిమా తర్వాత తెలుగు సినిమాలను పక్కన బెట్టి, కేవలం కోలీవుడ్‌పైనే దృష్టి పెట్టిన రాఘవ లారెన్స్... అక్కడ మంచి హిట్స్ కూడా సొంతం చేసుకుంటున్నాడు. తాజాగా ఈయన నటిస్తూ డైరెక్ట్ చేసిన 'కాంచన 3' రెండు భాషల్లో కలిపి రూ.100 కోట్ల గ్రాస్ ను కలెక్ట్ చేసినట్టు చిత్ర నిర్మాతలు ప్రకటించారు. ముఖ్యంగా హారర్ కామెడీ నేపథ్యంలో రాఘవ లారెన్స్ దర్శకత్వంలో వచ్చిన 'ముని', 'కాంచన', 'గంగ' సినిమాలు అక్కడా, ఇక్కడా మంచి కలెక్షన్స్ రాబట్టాయి. అదే సీక్వెల్‌లో వచ్చిన నాలుగో చిత్రం 'కాంచన 3'.తమిళ 'బిగ్‌బాస్' ప్రోగ్రామ్ ద్వారా పాపులారిటీ తెచ్చుకున్న ఓవియా, వేదిక, నిక్కీ తంబోలీ, కోవై సరళ ముఖ్య పాత్రల్లో నటించారు. 'కాంచన 3' సినిమా విడుదలైన అన్ని ఏరియాల్లో అద్భుతమైన వసూళ్ళని అందుకుని సంచలనం సృష్టించింది. ముఖ్యంగా బీ,సీ ఆడియన్స్ కు కనెక్ట్ అయ్యే అంశాలు పుష్కలంగా ఉండటంతో ఈ సినిమాకు బీసీ సెంటర్స్‌లో కలెక్షన్లు అదిరిపోయాయి. తొలిరోజు తెలుగు రాష్ట్రాల్లో కాంచన 3 దాదాపు 3.5 కోట్ల షేర్ రాబట్టింది. తాజాగా రెండు భాషల్లో కలిపి ఈ సినిమా రూ.100 కోట్ల క్లబ్బులో ఎంటరైనట్టు కాంచన 3 నిర్మాతలు ప్రకటించారు.మొత్తానికి ఫస్ట్ వీక్ కాకముందే రెండు భాషల్లో కలిపి రూ.100 కోట్ల క్లబ్బులో ఎంటరైన ఈ సినిమా ముందు ముందు ఎలాంటి సంచలనాలు నమోదు చేస్తుందో చూడాలి.

రాజధాని క్లాసిఫైడ్స్

హోటల్స్

విజయవాడ
నోవోటెల్
ఫోన్ : 0866 6688999

విజయవాడ
గేట్ వే
ఫోన్ : 0866 6644444

విజయవాడ
సదరన్ గ్రాండ్
ఫోన్ : 0866 6677777

మల్కాపురం
స్వాగత్ మెస్ - ప్యూర్ వెజిటేరియన్
ఫోన్ : 90329 58580

రాయపూడి
కాకతీయ ఫుడ్ కోర్ట్
ఫోన్ 9848021898

ఇతరములు

విజయవాడ బెంజ్ సర్కిల్
మీటింగ్ హాల్
ఫోన్ : 76809 94755

తుళ్ళూరు
ఎస్.ఎమ్(స్టైల్ ఫర్ మెన్) టైలర్స్
ఫోన్ : 9440307123

మందడం
ఎస్.ఆర్.కె. గ్రాండ్ రెస్టారెంట్
ఫోన్ : 9553023388

వెలగపూడి
సాయి గణేష్ ట్రెడర్స్: నిర్మాణ రంగానికిసిమెంట్, స్టీలు, పైపులు, పెయింట్‌లు అమ్మబడును.
ఫోన్ : 9640811333

రెంటల్స్

రాయపూడి
రాజధాని ప్రాంతం రాయపూడిలో 250 గజముల ఖాళీ స్థలము అద్దెకు కలదు
ఫోన్ : 9440662699

విజయవాడ
విజయవాడ బెంజ్ సెంటర్ దగ్గరలో పార్కింగ్ వసతిగల 1 బెడ్‌రూమ్ ఇల్లు అద్దెకు కావలెను
ఫోన్ : 76809 94755

హస్పటల్స్

విజయవాడ
ఆంధ్ర హస్పటల్, డా॥శ్రీమన్నారాయణ
ఫోన్ : 9177219900

విజయవాడ
న్యూఫేస్ కీనిక్ , డా॥మేహబూబ్
ఫోన్ : 9849122788

విజయవాడ
అష్రఫ్ మెటర్నిటీ & ఇ,ఎన్‌టి
డా॥ రెహమాన్
ఫోన్ : 0866-2475087

షాప్స్

తుళ్ళూరు
రేమాండ్స్ టైలర్స్
ఫోన్ : 9492470426

రాయపూడి
వర్షిత ఫోటోస్టాట్
ఫోన్ : 9985853188

తుళ్ళూరు
వైభవ్ డ్రస్సెస్
ఫోన్ : 9848407935

తుళ్ళూరు
రాజా గోల్డ్ కవరింగ్
ఫోన్ : 9581500500

తుళ్ళూరు
శ్రీసాయి జ్యూయలరీ వర్క్స్
ఫోన్ :9247171083

అమరావతి

నీరుకొండ
ఎస్ఆర్ఎమ్ యూనివర్సిటీ
ఫోన్ : 0863 2343000

ఐనవోలు
విఐటీ యూనవర్సిటీ
ఫోన్ : 0863 2370444

డా॥ దంటు నాగార్జున శర్మ వేదనిలయం, హైదరాబాద్ వారిచే
విజయవాడలో భారతదేశంలోని హిమాలయాలలో వివిధ విశేష క్షేత్రాల గురించి మరియు ఎన్నో సమస్యా పరిష్కార దేవాలయాల గురించి
అవగాహన కార్యక్రమం
తేది : 01-05-2019 బుధవారం
సమయం : సాయంత్రం 5.00 గం॥ల నుండి 8.00 గం॥ల వరకు
ప్రవేశం ఉచితం
వేదిక : బందరు రోడ్డులోని మీడియా హౌస్ (ఏ.సి. హాల్)
ఏ సమస్యకైనా పరిష్కార మార్గాలు చూపించగలిగే ఎన్నో క్షేత్రాల వివరాలు చెప్పబడును.
Dr. NAGARJUNA SHARMA DANTU
VEDA NILAYAM
Ph. : 98850-89092 / 8142209782 / 9550266396
Web : www.vedanilayam.com, Email : d.nagarjuna.sharma@gmail.com,
#Vedanilayam Spiritual Tours

రాజకీయ క్రీడలో

లంక రక్తసిక్తం

- భయం గుప్పెట్లో ప్రజలు
- బెంబేలెత్తుతున్న ముస్లింలు
- దాడుల్లో కొత్త ఉగ్రవాద సంస్థ

రాజకీయ క్రీడలో లంకపౌరులు ఊచకోతకు గురయ్యారు. దేశాధ్యక్షుడు సిరిసేన, ప్రధాని రణిల్ విక్రమసింఘేల మధ్య రాజకీయ విబేధాలు తలెత్తడంతో దేశ భద్రతపై దృష్టి సారించలేకపోయారనే వాదన వినిపిస్తోంది. దీన్ని అదునుగా తీసుకున్న ఉగ్రవాదులు ఆత్మాహుతి దాడికి పాల్పడి నరమేధాన్ని సృష్టించారని తెలుస్తోంది.

3నెలల కిందటే హెచ్చరించిన భారత్

ఐసీస్ లేదా ఐఎస్ కేపీ ఉగ్రవాదులు శ్రీలంకపై పెద్ద ఎత్తున విరుచుకు పడే ప్రమాదం ఉందంటూ మనదేశ జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) మూడు నెలల కిందటే హెచ్చరించింది. ఐసీస్ సానుభూతిపరునిగా భావించిన ఓ వ్యక్తిని చెన్నైలో ఎన్ఐఎ అధికారులు అరెస్టు చేశారు. అతణిని విచారించగా శ్రీలంకపై దాడులు చేసే అవకాశాలు ఉన్నట్లు తేలింది. అప్పుడే తొలిసారిగా దీని పేరు వినిపించిందని తెలుస్తోంది. మనదేశంపై తరచూ దాడులకు పాల్పడుతూ వచ్చిన లష్కరే తోయిబా సహా ఈ ఏడాది ఫిబ్రవరి 14న జమ్మూకాశ్మీర్ లోని పుల్వామా జిల్లా అవంతిపురా వద్ద సీఆర్పీఎఫ్ కాన్వాయ్ పై ఆత్మాహుతి దాడికి పాల్పడిన జైషె మహమ్మద్ సంస్థతోనూ ప్రత్యక్ష సంబంధాలు ఉన్నట్లు ఎన్ఐఏ దర్యాప్తులో తేలిందని సమాచారం. మాల్దీవులు, శ్రీలంకలో ఐఎస్‌కేపీ స్థానిక యువకులను ఉగ్రవాదం వైపు ప్రోత్సహించి, వారిని దేశం దాటించిందంటూ స్పష్టమైందని జాతీయ దర్యాప్తు సంస్థ అంచనా వేసింది.

ఘటనకు 2 గంటల ముందే మళ్లీ హెచ్చరిక

శ్రీలంకలో ఆదివారం ఆత్మాహుతి దాడుల పెను ముప్పును మన దేశ ఇంటెలిజెన్స్ అధికారులు ముందే గ్రహించారు. దీనిపై శ్రీలంక ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తొలి ఆత్మాహుతి దాడికి రెండు గంటల ముందు శ్రీలంక ఇంటెలిజెన్స్ అధికారులతో భారత ఇంటెలిజెన్స్ అధికారులు సంప్రదింపులు జరిపారని, శ్రీలంకలోని కొన్ని చర్చిలకు ముప్పు ఉన్నదని భారత అధికారులు హెచ్చరించారని శ్రీలంక రక్షణ శాఖ అధికారి తెలిపారు. ఇదే విషయంపై భారత అధికారులు శనివారం రాత్రి కూడా తమను హెచ్చరించినట్టు శ్రీలంక ప్రభుత్వ అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఈ నెల 4వ తేదీతోపాటు 20న కూడా శ్రీలంక ఇంటెలిజెన్స్ అధికారులకు ఇదేవిధమైన హెచ్చరికలను పంపినట్టు భారత ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

ఈస్టర్ రోజున శ్రీలంకలో పేలిన వరుస బాంబుల ధాటికి 253 మంది మృతి చెందారు. చాలా మందికి తీవ్రగాయాలయ్యాయి. ఈ పేలుళ్లకు సంబంధించి పోలీసులు ఇప్పటి వరకు 100 మందిని అరెస్టు చేశారు. పేలుళ్లకు పాల్పడింది తామే అని ఐసీస్ ఉగ్రవాద సంస్థ ప్రకటించింది. న్యూజిలాండ్‌లోని మసీదులో కాల్పులకు ప్రతీకార చర్యగానే శ్రీలంకలో పేలుళ్లు జరిపారని శ్రీలంక అధికారులు తెలిపారు. మొత్తం ఏడుగురు ఈ ఆత్మాహుతి దాడులకు పాల్పడ్డారు. అందులో ఒక మహిళ కూడా ఉందని అధికారులు చెబుతున్నారు.

కుట్రదారుని సోదరి ఖండన

ప్రధాన కుట్రదారులుగా భావిస్తున్న జహరాన్ హషిమ్ సోదరి హషిమ్ మదానియా బీబీసీతో మాట్లాడుతూ తన సోదరుడు చేసిన దానిని తీవ్రంగా ఖండించారు. కుట్ర గురించి తనకు ఏ విషయం తెలియదన్నారు. "అతడు చేసిన ఘోరం నాకు మీడియా ద్వారానే తెలిసింది. తను అలా చేస్తాడని నేను ఎప్పుడూ అనుకోలేదు. అతడు చేసిన కుట్రను నేను తీవ్రంగా ఖండిస్తున్నాను. తను నా సోదరుడైనా సరే ఇలాంటి వాటికి నేను విరుద్ధం. నాకిప్పుడు తన గురించి ఏ దిగులూ లేదు" అని మదానియా అన్నారు.

కాపర్ ఫ్యాక్టరీలో బాంబుల తయారీ

యజమానీ ఆత్మాహుతి దళ సభ్యుడే!

ఆర్థికంగా ఉన్నత కుటుంబానికి చెందిన అహ్మద్-వెల్లంపిటియా పారిశ్రామికవాడలో కాపర్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేశాడు. చాలాకాలంగా ఈ ఫ్యాక్టరీ అక్కడ కొనసాగుతోంది. ఇన్షాఫ్ అహ్మద్ కు ఐసిస్ ఉగ్రవాదులతో పరిచయం ఏర్పడి ఉండొచ్చని, తదనంతరం అతను ఐసిస్ ఉగ్రవాదిగా లేదా సానుభూతిపరునిగా మారి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. దీనికి సంబంధించిన సమాచారాన్ని సేకరించే పనిలో పడ్డారు. ఈ ఫ్యాక్టరీపై దాడి చేసిన పోలీసులు.. తొమ్మిది మంది సిబ్బందిని అరెస్టు చేశారు. వారిని విచారిస్తున్నారు. ఫ్యాక్టరీకి వచ్చీ, పోయే వారి గురించి ఆరా తీస్తున్నారు. ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికుల్లో భారతీయులు, బంగ్లాదేశీయులు ఉన్నట్లు తెలుస్తోంది. షాంగ్రిలా హోటల్ పై ఆత్మాహుతిదాడి చేసింది ఇబ్రహీమేనని పోలీసులు ధృవీకరించారు. ట్రయాసిటోన్ ట్రైపెరాక్సైడ్ రసాయినాలు వాడి, చర్చ్‌లు, హోటళ్లపై ఆత్మాహుతి దళాలు అత్యంత శక్తిమంతమైన బాంబులను వినియోగించారని తేటతెల్లమైంది. అవి అంచనాకు మించి విధ్వంసాన్ని సృష్టించాయని పోలీసులు చెబుతున్నారు. దీన్ని విక్రయించిన దుకాణదారులపైనా పోలీసులు నిఘా వేశారు. ఆయా దుకాణదారులను అదుపులోకి తీసుకుని, విచారిస్తున్నారు. 2015లో ప్యారిస్, 2017లో మాంఛెస్టర్ లో చోటుచేసుకున్న ఉగ్రవాద దాడులకు వినియోగించిన బాంబుల్లో కూడా ఇదే ట్రయాసిటోన్ ట్రైపెరాక్సైడ్ ను వాడిన విషయం తెలిసిందే.

దాడుల్లో కొత్త ఉగ్రవాద సంస్థ

ఈస్టర్ ఆదివారం (ఈనెల 21న) శ్రీలంకలో మారణహోమం సృష్టించిన దాడుల్లో కొత్త ఉగ్రవాద సంస్థ పేరు తెర మీదికి వచ్చింది. దీని పేరు ఇస్లామిక్ స్టేట్ ఖొరాసన్ ప్రావిన్స్ (ఐఎస్ కేపీ). ఇరాక్ కేంద్రంగా పని చేస్తోన్న భయానక ఉగ్రవాద సంస్థ ఐసిస్‌కు అనుబంధంగా ఇది పుట్టుకొచ్చినట్లు తెలుస్తోంది. రాజధాని కొలంబో సహా పలు చోట్ల ఆత్మాహుతి దాడులకు సూత్రధారిగా అనుమానిస్తోన్న అబు ఉబైదా అలియాస్ జహ్రాన్ హషిమ్ ఐఎస్ కేపీ ఉగ్రవాద సంస్థ నేతృత్వం వహించినట్లు తెలుస్తోంది. ఐసీస్‌కు అనుబంధంగా పనిచేస్తోన్న ఐఎస్ కేపీ సంస్థే శ్రీలంక నరమేధానికి కారణమై ఉండొచ్చని తెలుస్తోంది. ఈ దిశగా శ్రీలంక ప్రభుత్వం దర్యాప్తు సాగిస్తోంది.

తమ కార్యకలాపాలను కొత్త దేశాలకు విస్తరింపజేస్తున్నట్లు ఐసీస్ 2014లో ఓ ప్రకటన చేసినట్లు చెబుతున్నారు. దీనికి అనుగుణంగా..ఆఫ్ఘనిస్తాన్, ఇరాన్, తుర్క్ మెనిస్తాన్, ఉజ్బెకిస్తాన్ దేశాల సరిహద్దులను కేంద్రంగా చేసుకుని, ఆయా దేశాల్లోని కొంత భూభాగాన్ని ఒకే గొడుగు కిందికి తీసుకుని వచ్చిన ప్రాంతాలను గ్రేటర్ ఖొరాసన్ గా గుర్తించారు. ఈ గ్రేటర్ ఖొరాసన్ ప్రావిన్స్‌ను కేంద్రంగా చేసుకుని ఐఎస్ కేపీ ఆవిర్భవించిందని అంటున్నారు. ఐఎస్ కేపీ సంస్థకు జహ్రాయిన్ హాషిమ్ కొన్నాళ్లపాటు నేతృత్వం వహించాడని, అనంతరం శ్రీలంకలో నేషనల్ తౌహీత్ జమాత్‌ను ఏర్పాటు చేశాడని అంతర్జాతీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. 2014లో పాకిస్తాన్ కు చెందిన హఫీజ్ సయీద్ ఖాన్ అనే వ్యక్తి ఐఎస్ కేపీకి నేతృత్వం వహించాడని, అతని తరువాత హాషీమ్ నాయకత్వ బాధ్యతలను స్వీకరించాడని చెబుతున్నారు.

ఇప్పుడు మేం ఎక్కడికి వెళ్లాలి ?

అహ్మదీల్లో అత్యధికులు కేథలిక్ క్రైస్తవుల ఇళ్లల్లో అద్దెకు ఉంటున్నారు. దాడులు ఈ నెల 21న జరగ్గా, 24 నుంచి అహ్మదీ ముస్లింలలో ఆందోళన పెరుగుతూ వస్తోంది.దాడి జరిగిన చర్చికి కొంత దూరంలోనే మా ఇల్లు ఉంది. దాడి తర్వాత మా ఇంటి యజమాని చాలా ఆందోళన చెందారు. మరెక్కడైనా సురక్షితంగా ఉండాలని నాకు చెప్పారు. నేను, నాలాగే చాలా మంది ఒకేసారి సంవత్సరం అద్దె చెల్లించి ఉంటున్నారు. మేం ఇప్పుడు ఎక్కడికి వెళ్లాలి"

అని 27 ఏళ్ల హబీస్ రబ్బా సోయబ్ విచారం వ్యక్తం చేశారు. ఐక్యరాజ్యసమితి శరణార్థుల హైకమిషనర్(యూఎన్‌హెచ్‌సీఆర్) తోడ్పాటుతో దాదాపు 800 మంది పాకిస్తానీ అహ్మదీలు నెగోంబోలో ఉంటున్నారు. మతపర హింసకు భయపడిన వీరంతా పాకిస్తాన్ నుంచి పారిపోయి నెగోంబో వచ్చారు.ఐరోపా దేశాల్లో లేదా అమెరికాలో ఆశ్రయం కోసం వారుప్రయత్నాలు చేస్తున్నారు.నెగోంబోలో స్థానికులైన అహ్మదీలు ఐదు వేల మందికి పైగా ఉన్నారు. వీరిలో చాలా మంది ఏళ్లతరబడి నెగోంబోలో ఉంటున్నారు. వారికి సొంత ఇళ్లు, వ్యాపారాలు కూడా ఉన్నాయి."మేం ఇక్కడ చాలా కాలంగా ఉంటున్నందున మమ్మల్ని ఎవరూ బెదిరించడం లేదు" అని పాకిస్తానీ అహ్మదీలకు సహాయం అందిస్తున్న స్థానిక ముస్లింయువతలో ఒకరు చెప్పారు.ఇటు ఆత్మాహుతి దాడుల్లో చనిపోయిన భారతీయుల కుటుంబాలు శ్రీలంకలో భద్రత లోపాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

భయం గుప్పిట్లో శ్రీలంక

శ్రీలంక ప్రభుత్వం ఈ ఆత్మాహుతి దాడులకు స్థానిక జిహాదీ సంస్థే కారణమని చెబుతోంది.ఈ కేసులో ఇప్పటివరకూ పోలీసులు 100 మందికి పైగా అరెస్టు చేశారు. దేశంలో అత్యవసర స్థితి కొనసాగుతోంది. ఇస్లామిక్ స్టేట్ కూడా ఈ దాడులు తమ పనే అని చెప్పుకుంది. దీనిపై దర్యాప్తు కొనసాగుతోంది. శ్రీలంక ఈ దాడుల నుంచి ఇంకా కోలుకోలేకపోతోంది. ఎప్పుడు, ఎక్కడ, ఎవరు బాంబు పేలుస్తారోనని దేశమంతా భయంలో గడుపుతోంది.

> దేశం ఏదైనా పాలకుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా పరిణమిస్తోంది. నిఘా వర్గాలు హెచ్చరించినప్పటికీ భద్రత పటిష్టం చేయకుండా చోద్యం చూసి తప్పుచేశాం క్షమించండి అనడం ఏమాత్రం సబబుకాదు..ఈ విషయంలో భారత్ పరిస్థితి మరింత ఘోరంగా ఉంది. పుల్వామా ఘటనలో మృతి చెందిన సైనిక కుటుంబాలకు మన పాలకులు ఆమాత్రం సంజాయిషీ కూడా ఇవ్వలేదు..

సిరిసేన ఆగ్రహం

శ్రీలంక బాంబు పేలుడు ఘటనలో నిఘా విభాగం విఫలమైందని పేర్కొంటూ ఆ దేశ అధ్యక్షుడు మైత్రిపాల సిరిసేన సీరియస్ అయ్యారు. భద్రత విషయంలో భారీ తప్పిదం జరిగిందని శ్రీలంక ప్రభుత్వం అంగీకరించింది. రక్షణ మంత్రి, పోలీస్ చీఫ్‌లను అధ్యక్షుడు మైత్రీపాల సిరిసేన వారి పదవుల నుంచి తొలగించారు.శ్రీలంకలో బాంబు పేలుళ్లు జరిగే అవకాశం ఉందని ఇతర దేశాల నుంచి సమాచారం వచ్చినప్పటికీ తన దృష్టికి ఎందుకు తీసుకురాలేదని సిరిసేన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. అంతేకాదు భద్రతా దళాల నాయకత్వంలో త్వరలో మార్పులు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

భయాందోళనలో ముస్లిం మైనారిటీలు

తమపై హింస జరుగుతుందనే ఆందోళన శ్రీలంక ముస్లింలలో నెలకొంది. నెగోంబోలో చాలా మంది మైనారిటీ తెగ అహ్మదీకి చెందినవారు. వీరిలో కొందరు ప్రస్తుతం పోలీసు రక్షణలో ఒక మసీదులో ఉంటున్నారు. ఈ తెగ ముస్లింలుగానే చెప్పుకొంటారు. వారు ఖురాన్‌ను పాటిస్తారు. చాలా మంది సంప్రదాయ ముస్లింలు మాత్రం వీరు ఇస్లాం సంప్రదాయాలకు విరుద్ధంగా ఉంటారని భావిస్తారు. శ్రీలంక అహ్మదీ ముస్లింలలో చాలా మంది పాకిస్తాన్, ఇతర దేశాల్లో మతపర హింస నుంచి బయటపడేందుకు అక్కడి నుంచి పారిపోయి వచ్చినవారే.కొందరు అహ్మదీ ముస్లింలపై దాడులు జరిగాయని ప్రధాని రణిల్ విక్రమసింఘే అంగీకరించారు. శ్రీలంక జనాభా 2.1 కోట్లు కాగా అందులో ముస్లింలు పది శాతంలోపే ఉంటారు. ఈ నెల 25 నాటికి నెగోంబోలోని ఫైజుల్ మసీదులో 600 మందికి పైగా అహ్మదీలు ఆశ్రయం పొందుతున్నారు.శ్రీలంకలోని ఐదు అహ్మదీ మసీదుల్లో ఇది ఒకటి.

నిందితులది సంపన్న కుటుంబం

ఉగ్రవాద సంస్థలు ఆత్మహుతి దాడులకు, ఉగ్రవాదానికి ఆకర్షించేందుకు ఆర్థికంగా వెనకబడిన కుటుంబాలతో పాటు ఇతర సామాజిక కారణాలు ఆసరాగా చేసుకుని తమవైపుకు తిప్పుకుంటాయి. అయితే శ్రీలంక బాంబు దాడుల్లో పాల్గొన్నది మాత్రం ఆ దేశంలోని ఓ సంపన్న కుటుంబానికి చెందిన వారంటే ఆశ్చర్యపడక తప్పదు. అత్యున్నతమైన స్థాయిలో ఉండి ఇలా వందాలాది ప్రాణాలకు బలిగొన్న వారు మేము గౌరవించిన వారేనా అంటూ చుట్టుపక్కల ప్రజలు ఆశ్చార్యానికి లోనవుతున్నారు. సుగంధ ద్రవ్యాల వ్యాపారి ఇద్దరు కుమారులు ఇన్షాఫ్ ఇబ్రహీం, ఇల్హాం ఇబ్రహీం శ్రీలంక ఆత్మాహుతి దాడుల్లో పాల్గొన్నారు. 33 ఏళ్ల ఇన్షాఫ్ ఇబ్రహీం ఒక కాపర్ ఫ్యాక్టరీ యజమాని కాగా ఇల్హామ్ ఇబ్రహీం పేరుమోసిన నగల వ్యాపారి కూతురును పెళ్లి చేసుకున్నారు. ఆత్మాహుతి దాడిలో పాల్గొన్న సోదరుల తండ్రికి చాలా మంచి పేరుంది. తన ఫ్యాక్టరీలో ఎవరికైన ఇబ్బంది కల్గితే స్పందిస్తారని వారు చెబుతున్నారు. కాగా ఈ సంఘటనతో ఒక వర్గానికి చెందని ప్రతి ఒక్కరిని అనుమానించాల్సిన పరిస్థితి వచ్చిందని పలువురు వాపోతున్నారు. కాగా ప్రస్తుతానికి వారి తండ్రి పోలీస్ కస్టడిలో ఉన్నాడు.

ఆత్మహుతి దాడులకు పాల్పడ్డ ఇల్హామ్ ఇబ్రహీం స్థానిక టెర్రర్ గ్రూప్ ఎన్‌టీజే సానుభూతిపరుడుగా చెబుతున్నారు. కాగా తన టెర్రరిస్టు సిద్ధాంతాలను ఓపెన్ గానే చెప్పేవాడని తెలిపారు. మరోవైపు ఇన్షామ్ కూడ కొంత మోడరేట్ గా ఆలోంచించే వాడని చెబుతున్నారు. ఇతను కూడ తన వద్ద ఉన్న ఉద్యోగులకు, ఇతరులకు సైతం సహాయం చేశాడని చెబుతున్నారు. వీరు ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్‌ల్లో విద్యనభ్యసించారు.

– ఖాన్

అతి అట్టహాసంగా వారాణసిలో మోదీ నామినేషన్

కోడ్ ఎక్కడ?

ఈనెల 26 న ప్రధాని నరేంద్ర మోదీ అతి అట్టహాసంగా వారాణసిలో లోక్ సభకు నామినేషన్ దాఖలు చేశారు. ఎన్డియే భాగస్వామ్య పక్షాల నాయకులు, భాజాపా పాలిత రాష్ట్రాలకు చెందిన కొందరు ముఖ్యమంత్రులు, భాజాపా అధ్యక్షులు అమిత్ షా, కేంద్రమంత్రులు ఇతర రాష్ట్రాలనుంచి రప్పించిన లక్షలాది ప్రజలు అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంత భారీ ఎత్తున నామినేషన్ కార్యక్రమం దేశంలో ఎప్పుడూ జరగలేదని పరిశీలకులు అంటున్నారు. రెండురోజులు జరిగిన ఈ కార్యక్రమంలో మొదటి రోజు లక్షల మందితో భారీ ర్యాలీ జరిగింది. వేలాది వాహనాలు ర్యాలీలో కనిపించాయి. ఇందుకోసం ఇతర రాష్ట్రాలనుంచి లక్షలమందిని వారణాసికి తరలించారు. గంగా హారతితో మొదటిరోజు కార్యక్రమం ముగిసింది. రెండవ రోజు అతిరథమహారథులు నామినేషన్ కార్యక్రమానికి హాజరయ్యారు. కోట్ల రూపాయలు ఖర్చయ్యాయి. తన పర్యటన ప్రజలకు కృతజ్ఞత చెప్పడానికి మాత్రమే అని ప్రధాని మోదీ చెప్పుకొచ్చారు. కాశ్మీర్ నుండి కన్యాకుమారివరకు ప్రజలు భాజాపాకు బ్రహ్మరథం పడుతున్నారని, భాజాపాని గెలిపించాలని నిర్ణయించారని మోదీ చెప్పారు.**ఎన్నికల నియమావళి అమలులో ఉన్న సమయం ప్రధానమంత్రి స్థానంలో ఉన్న నాయకుడు భారీ ఖర్చుతో ఇంత అట్టహాసంగా నామినేషన్ వేయడం శోచనీయమని ప్రతిపక్షాలే కాదు, పరిశీలకులు కూడా అంటున్నారు.** ఉత్తరప్రదేశ్‌లో భాజపా పరిస్థితి చేజారిపోయిందన్న వార్తలతో తన ఎన్నిక సమస్య కాకుండా ఉండటం కోసమే మోదీ ఇంత హడావిడి చేశాడని పరిశీలకుల అభిప్రాయం. ఈ హడావిడికి మరో కారణం కూడా చెబుతున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సోదరి, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక వాద్ర వారణాసి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తారని వార్తలు వచ్చిన నేపథ్యంలో ఇంత భారీస్థాయిలో జనసమీకరణకు ఏర్పాట్లు జరిగాయని పరిశీలకుల భావన. కాని, తూర్పు ఉత్తరప్రదేశ్ లో వారణాసితో సహా అనేక నియోజకవర్గాలలో పర్యటించవలసి ఉండటంతో ప్రియాంక ఎన్నికల బరిలో లేరని కాంగ్రెస్ వర్గాలు పేర్కొన్నాయి. తూర్పు ఉత్తరప్రదేశ్ పర్యటనలో భాగంగా ప్రియాంక కొద్దిరోజులక్రితం వారాణసిలో విస్తారంగా పర్యటించారు. పడవలలో గంగానదిలో ప్రయాణించి వేలమంది ప్రజలను కలుసుకున్నారు. ప్రియాంక ప్రచార ప్రభావం ఎన్నికలపై పడకూడదని మోదీ భారీ ఎత్తున నామినేషన్ కార్యక్రమం నిర్వహించారు. మోదీ నామినేష కార్యక్రమ ప్రభావం ఉత్తరప్రదేశ్ ఎన్నికలపై ఏ మాత్రం ప్రభావం చూపుతాయో ఫలితాలే తేలుస్తాయి .

ముఖ్యమంత్రి అధికారంపై తీవ్ర పోరుకు చంద్రబాబు

(మొదటిపేజీ తరువాయి)

చెప్పడానికి ఈ ఉదాహరణ చాలని తెలుగుదేశం వర్గాలు పేర్కొన్నాయి. పోరుగురాష్ట్రం తెలంగాణాలో తెరాస ప్రభుత్వం సమీక్షలు జరుపుతున్నది. అధికారులతో సమావేశాలు జరుగుతున్నాయి. అధికారులకు ఆదేశాలు కూడా ఇస్తున్నారు. ఇక్కడ ఎన్నికల నియమావళి లేదా ?

ఒక్క ఆంధ్రప్రదేశ్ విషయంలో ఎన్నికల కమీషన్ వేరుగా ప్రవర్తించడం కేంద్రప్రభుత్వ ప్రమేయంతో అనే అనుమానాలు రాక తప్పదు. లోక్ సభ కు కూడా ఎన్నికలు జరుగుతున్నందున కేంద్రప్రభుత్వ ప్రమేయం తగదు కదా. ఏమైనా ఎన్నికల నియమావళిపై స్పష్టత రావడం అవసరం.

ముస్లింలను ఉగ్రవాదులుగా చూడొద్దు

సిరిసేన

శ్రీలంకలో ఆదివారం ఈస్టర్ నాడు ఉగ్రవాదులు చర్చిలు, హోటళ్లపై ఆత్మాహుతి దాడులు చెయ్యడం... వాటి వెనక తామే ఉన్నామని ఐసిస్ ప్రకటించడం... న్యూజిలాండ్‌లో ముస్లింలపై దాడులకు నిరసనగా ఈ దాడులు చేసినట్లు చెప్పడంతో... సహజంగానే శ్రీలంకలో ముస్లింలపై ఒక రకమైన వ్యతిరేకత కనిపిస్తోంది. ఈ పరిస్థితిని గమనించిన శ్రీలంక అధ్యక్షుడు మైత్రిపాల సిరిసేన... తమ దేశ ప్రజలను ఉద్దేశించి స్పందించారు. దేశంలో మైనార్టీ వర్గంగా ఉన్న ముస్లింలను ఉగ్రవాదులుగా చూడొద్దని ప్రజలను కోరారు. కొలంబోలోని రిపోర్టర్లతో మాట్లాడిన ఆయన... దాడుల పేరుతో మత కల్లోలాలు సృష్టించవద్దని కోరారు. ఐసిస్ ఉగ్రవాదుల చర్యల్ని పూర్తి స్థాయిలో అడ్డుకునే శక్తి సామర్థ్యాలు తమకు ఉన్నాయన్న ఆయన... దాడుల వెనక తామే ఉన్నట్లు ఐసిస్ చెప్పుకుంటోందని అన్నారు.

దాడులపై నిఘా వర్గాలు ముందుగానే హెచ్చరించినా ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదని విలేకరులు ప్రశ్నించగా... అందుకు బాధ్యులైన రక్షణ శాఖ కార్యదర్శి తన పదవికి రాజీనామా చేశారని తెలిపారు. ఆయన రాజీనామా చేసినా... ఆ పదవిలో మరొకరు వచ్చే వరకూ ఆయనే కొనసాగుతారని తెలిపారు. పోలీస్ చీఫ్‌ను త్వరలోనే పదవి నుంచి తప్పిస్తామన్నారు.

జయసుందర రాజీనామా..

కొలంబో : శ్రీలంకలో మరో వికెట్ పడింది. శ్రీలంక పోలీసు విభాగం అత్యున్నత అధికారి, ఇన్ స్పెక్టర్ జనరల్ పుజిత్ జయసుందర తన పదవికి రాజీనామా చేశారు. ఆత్మాహుతి దళాల పేలుళ్లకు నైతిక బాధ్యత వహిస్తూ ఆయన రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. ఈస్టర్ సండే నాడు చర్చిలు, హోటళ్లపై ఉగ్రవాదుల ఆత్మాహుతి దాడులు చోటు చేసుకోవచ్చంటూ ఇంటెలిజెన్స్ వర్గాల నుంచి పదిరోజుల ముందే సమాచారం అందినప్పటికీ..దాన్ని నిరోధించడంలో విఫలమయ్యారనే ఆరోపణలను జయసుందర ఎదుర్కొంటున్నారు. జయసుందర రాజీనామా చేసిన విషయాన్ని శ్రీలంక అధ్యక్షుడు మైత్రిపాల సిరిసేన ధృవీకరించారు. జయసుందర తన ఉద్యోగానికి రాజీనామా చేశారని వెల్లడించారు. త్వరలోనే కొత్త ఇన్ స్పెక్టర్ జనరల్ ను నియమిస్తానని అన్నారు. ఆత్మాహుతిదాడుల అనంతరం- ప్రభుత్వ విభాగంలోని అత్యున్నత స్థాయి అధికారి రాజీనామా చేయడం ఇది రెండోసారి. ఇదివరకు- శ్రీలంక రక్షణమంత్రిత్వ శాఖ కార్యదర్శి హేమసిరి ఫెర్నాండో రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దేశాధ్యక్షుడు మైత్రిపాల సిరిసేన ఆదేశాల మేరకు హేమసిరి విధుల నుంచి తప్పుకొన్నారు.

ఇదిలావుండగా.. రక్షణ మంత్రిత్వశాఖ కార్యకలాపాలను ప్రధానమంత్రి రణిల్ విక్రమసింఘే స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. రోజువారీ సమీక్షా సమావేశాలను నిర్వహిస్తున్నారు. దేశంలో అక్రమంగా నివసిస్తున్న వారిపై ఉక్కుపాదం మోపాలని రణిల్ ఆదేశించారు. ఈ విషయంలో ఆయన పోలీసులు, భద్రతా బలగాలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చినట్లు చెబుతున్నారు. వీసా గడువు ముగిసినప్పటికీ.. స్వదేశానికి వెళ్లకుండా, లంకలోనే తలదాచుకుంటున్న వారిని అన్వేషిస్తున్నారు పోలీసులు. పాస్ పోర్టు కాల పరిమితి ముగిసిన వారినీ అదుపులోకి తీసుకుంటున్నారు. ఆత్మాహుతి దాడులకు సహకరించి ఉంటారనే అనుమానంపై పోలీసులు ఇప్పటికే 140 మందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వారి నుంచి మరింత కీలకమైన సమాచారాన్ని రాబట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. రాజధాని కొలంబో సహా దేశంలో వివిధ ప్రాంతాల్లో మరిన్ని ఉగ్రవాదుల దాడులు చోటు చేసుకోవచ్చనే సమాచారం ఉందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని, దేశ మారుమూల ప్రాంతాల్లో కూడా విస్తృత సోదాలు నిర్వహిస్తున్నట్లు రణిల్ విక్రమసింఘే తెలిపారు.

- బోస్

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor: Pattan Hussain Khan, RNI NO: APTEL/2015/66622, Postal Regd No: GTR/84/2019-21, Cell 7680994755, Email : rajadhanivartalu1@gmail.com